
ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -3 పేజీలు - 8 వెల - 03/- సోమవారం 27 ఏప్రిల్ 2026

# ఇంధన కొరతపై టాస్క్ ఫోర్స్



## ఎక్కడా పెట్రోల్ బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు కనిపించకూడదు: సీఎం చంద్రబాబు

**ఏపీలో పలు చోట్ల ఇంధన కొరత... పెట్రోల్ బంకుల మూసివేత**

**ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకున్న చంద్రబాబు**

**ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో టెలీకాన్ఫరెన్స్**

**అనుమతులపై పునరాలోచన చేయాల్సి వస్తుందని వార్నింగ్**



**అమరావతి ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. గత కొన్ని రోజులుగా మొదలైన ఈ కొరత శని, ఆదివారాల్లో తీవ్రమైంది. ఇంధన కొరతతో రాష్ట్రంలో అనేకచోట్ల పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల బంకులు మూతపడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. స్టాక్ ఉన్న బంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడ్డ పరిస్థితి నెలకొంది. పనులు మానుకొని సైతం గంటల తరబడి పడిగాపులు కాశారు. స్టాక్ ఉన్నచోట కూడా పరిమితంగానే విక్రయాలు జరిగాయి. **మిగతా 2లో...**

# వైట్‌హౌస్‌లో కాల్పుల కలకలం

**సురక్షితంగా బయటపడిన ట్రంప్ దంపతులు, మంత్రులు**

**సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ల అదుపులో నిందితుడు**





**వాషింగ్టన్ ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా శ్వేతసౌధం సమీపంలో శనివారం రాత్రి జరిగిన కాల్పుల ఘటన కలకలం రేపింది. వాషిం గ్టన్ డీసీలోని హిల్టన్ హోటల్‌లో జరిగిన వైట్‌హౌస్ పాత్రికేయుల విందు కార్యక్రమ ంలో ఓ దుండగుడు కాల్పులు జరిపాడు. అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడ లేదు. కాల్పులు జరిగిన వెంటనే దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్, విదేశాంగ మంత్రి **మిగతా 2లో...**

# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం



**సీఎంను కలిసి ఆహ్వాన పత్రిక అందించిన ఎమ్మెల్యే కురుగొండ్ల**

**ఈనెల 27 నుంచి మే 3 వరకు జరగనున్న ఉత్సవాలు**

**అమరావతి ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
ముఖ్యమంత్రి చంద్రబాబును నెల్లూరు జిల్లా పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ప్రత్యేకంగా ఆహ్వానించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, ఆలయ పాలకమండలి ఛైర్మన్ తిరుపాల్ రెడ్డి సోమవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసి **మిగతా 2లో...**

# గూగుల్ రాకతో విశాఖకు విశ్వఖ్యాతి...

**ఈ నెల 28న సీఎం చంద్రబాబు శంకుస్థాపన**

**విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు**

**ఈ నెల 28న శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు**

**15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో నిర్మాణం**

**1 గిగావాట్ సామర్థ్యంతో రానున్న హైపర్ స్కేల్ సెంటర్**

**భారీగా ఉపాధి అవకాశాలు.. టెక్ హబ్‌గా ఏపీ**

**అమరావతి ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెడుతోంది. 1995-2004 మధ్య కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ హబ్‌గా మార్చిన చంద్రబాబు, ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్‌లో మరో భారీ టెక్ విప్లవానికి నాంది పలుకుతున్నారు. అంతర్జాతీయ టెక్ దిగ్గజం గూగుల్ తన ఏఐ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తుండటమే దీనికి నిదర్శనం. **మిగతా 2లో...**



# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

**రెండో దశలో మండలాలకు విస్తరించండి**

**ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్**

**అన్ని స్థాయిల్లో నిత్యం పర్యవేక్షించాలి**

**: 'సీఎం ప్రజావాణి' సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్‌ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మరుసటి రోజు (08.12.2023) మహాత్మ జ్యోతిభాపూలే ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించిన ప్రతి మంగళవారం



# తెలంగాణలో ఎండల ఉగ్రరూపం..

**వడదెబ్బకు నలుగురి బలి**

**రాష్ట్రంలో కొనసాగుతున్న తీవ్రమైన ఎండలు**

**మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**

**నాగర్‌కర్నూల్‌లో పిడుగుపాటుకు ఒక యువకుడి మృతి**

**పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు**



# శాంతి చర్చలంటూ అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు

**లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినా.**

**. ఆగని ఇజ్రాయిల్ దాడులు**

**దిగ్బంధనాలు, బెదిరింపులతో చర్చలు అసాధ్యం :**

**అమెరికాతో ఒప్పందంపై ఇరాన్ ప్రధాని కీలక వ్యాఖ్యలు**



# గుర్తింపు కోసమే కేసీఆర్‌పై విమర్శలు

**రాష్ట్ర ప్రజలు సీఎం పేరెత్తడానికే ఇష్టపడట్లేదు**

**తెలంగాణపై మళ్ళీ కుట్రలు ప్రారంభమయ్యాయి : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**హైదరాబాద్‌ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా కొంత మంది వ్యక్తులు తమకు సరైన గుర్తింపు రావడం లేదని కేసీఆర్‌పై విమర్శలు చేస్తూ కాలం వెల్లబుచ్చుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీఎం అయిన తర్వాత కూడా యాక్టర్లు, యాంకర్ల నుంచి తెలంగాణ ప్రజల వరకు తన పేరెత్తడానికి ఇష్టపడటం లేదన్న ఆక్రోషంతోనే ప్రతిరోజు మాజీ సీఎంపై అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. **మిగతా 2లో...**



# యూరప్ టూర్‌కు జగన్..

**బ్లూ డెనిమ్ షర్ట్, జీన్స్ ప్యాంట్‌తో ట్రెండీ లుక్‌లో జగన్**

**జగన్ కొత్త లుక్‌పై సోషల్ మీడియాలో జోరుగా చర్చ**

**అమరావతి ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి యూరప్ పర్యటనకు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన సరికొత్త డ్రెస్సింగ్ స్టైల్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన కొత్త లుక్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. **మిగతా 2లో...**



# వైట్‌హౌస్‌లో కాల్పుల కలకలం

**మొదటిపేజీ తరువాయి**

మార్కో రుబియోలను అక్కడి నుంచి హుటాహుటిన తరలించా రు. ఐదు నుంచి ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిగాయని ఘటనా స్థలంలో ఉన్న కొందరు వ్యక్తులు తెలిపారు. ప్రాణభయం తో అనేక మంది అతిథులు టేబుల్స్ కింద దాక్కున్నారు. షాట్‌గన్, హ్యాండ్‌గన్‌తో పాటు అనేక కత్తులతో వచ్చిన నిందితుడు భద్రతా వలయాన్ని దాటుకొని లోపలికి ప్రవేశించి హఠాత్తుగా కాల్పులు మొదలు పెట్టాడు. కాగా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, అధికారులు అద్భుతంగా పనిచేశారని, తామంతా క్షేమంగా ఉన్నా మని ట్రంప్ చెప్పారు. కాల్పులు జరిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నా రని తెలిపారు. ఇరాన్‌పై తాము జరుపుతున్న యుద్ధానికి, ఈ దాడికి సంబంధం ఉన్నదని తాను అనుకోవడం లేదని అన్నారు. అయితే ఏదీ చెప్పలేమని వ్యాఖ్యానించారు.

**ప్రత్యక్షసాక్షి కథనం ప్రకారండ**

కాల్పులు జరిపేందుకు పథకాన్ని రూపొందించుకున్న నిందితుడు హోటల్ లోనే ఆయుధాన్ని సిద్ధం చేసుకున్నాడని ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. శీతల పానీయాలు ఉంచే గది సమీపంలో పెద్దగా భద్రతా ఏర్పాట్లు ఉండవని తెలుసుకున్న నిందితుడు కోల్ టామోస్ అలెన్ అక్కడే దాక్కున్నాడని, ఓ బ్యాగు నుంచి పొడవైన తుపాకీని బయటికి తీశా డని, ఆ తర్వాత ఆకస్మికంగా విందు జరుగుతున్న బాల్ రూమ్ వైపు ఆ తుపాకీ పట్టుకొని పరుగులు తీశాడని వివరించా రు. ఆ వెంటనే విచక్షణా రహితంగా అన్ని వైపులా కాల్పులు జరిపాడని తెలిపారు. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, భద్రతా దళాలు అతనిని పట్టుకునేందుకు పరుగులు తీశారు.

**ఉన్నత విద్యావంతుడే కానీ**

డొనాల్డ్ ట్రంప్, ఆయన క్యాబినెట్ సహచరులు హాజరైన విందులో కాల్పుల కు పాల్పడిన నిందితుడు ఒక ఉన్నత విద్యావంతుడని తెలిసింది. దర్యా ప్తు బృందాలు అతనిని కోల్ టామోస్ అలెన్‌గా గుర్తించారు. అతను కాలిఫోర్ని యాలోని లాస్ ఏంజెల్స్ శివారులో ఉన్న టోరెన్స్ ప్రాంతానికి చెందిన వాడు. కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాల జీలో 2017లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ చదివాడు. విద్యార్థిగా ఉన్న సమయంలోనే వీల్‌చైర్స్‌కు అత్యవసర బ్రేకులను ప్రయోగాత్మకంగా తయారు చేసి ప్రశంసలు పొందాడు. ఆ తర్వాత కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. 2018లో ఓ వీడియో గేమ్‌ను తయారు చేసి ట్రేడ్‌మార్క్ కోసం రిజిస్టర్ చేసుకున్నాడు. ఇటీవలే 'ఫస్టలా' పేరిట ఇంకో వీడియో గేమ్‌ను కూడా రూపొందిం చాడు. 2014లో జెట్ ప్రొపల్షన్ ల్యాబ్‌లో నాసా నిర్వహించిన ఫెలోషిప్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ప్రస్తుతం ఓ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. 2024 డిసెంబరులో టీచర్ ఆఫ్ ది మంత్‌గా ఎంపికయ్యాడు కూడా. అతను డెమొక్రటిక్ పార్టీ సానుభూతిపరుడని తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన కమలా హారిస్ ప్రచారానికి పాతిక డాలర్ల విరాళం ఇచ్చాడని ఫెడరల్ ఎలక్షన్ కమిషన్ రికార్డులలో ఉంది. కాగా లాస్ ఏంజెల్స్ శివారులోని టోరెన్స్‌లో అలెన్ నివసిస్తున్న ఇంటి వద్దకు చేరుకున్న ఎఫ్‌బీఐ ఏజెంట్లు ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించారు. పలువురు పాత్రికేయులు కూడా అక్కడికి చేరుకున్నారు.

**ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావు లేదు**

**వాషింగ్టన్ ఘటనపై ప్రపంచ నేతలు**

శ్వేతసౌధం కరస్పాండెంట్ల డిన్నర్ కార్యక్రమంలో జరిగిన కాల్పుల ఘటన నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన మంత్రిమండలిలోని కీలక సభ్యులు సురక్షితంగా బయటపడడంపై ప్రపంచ దేశాల నేతలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ హింసకు తావు లేదని వారు స్పష్టం చేశారు. కాల్పుల ఘటన నుంచి అమెరికా నేతలు క్షేమంగా బయటపడడం తనకు ఊరట కలిగించిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఈ దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా అమెరికాలో జరిగిన దాడిని కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఖండించారు. హింస దేనికీ మార్గం కాదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షేన్‌బామ్ అన్నారు. శాంతి విలువలను సమర్థించే ప్రజలకు హింస ఎన్నటికీ మార్గం కాదని వెనిజులా అధ్యక్షురాలు రోడ్రిగుయెజ్ చెప్పారు. దాడి తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని తైవాన్ అధ్యక్షుడు చింగ్ టే తెలిపారు. కాగా అమెరికాలో పార్టీలకు అతీతంగా చట్టసభ సభ్యులందరూ దాడిని ఖండించారు.

# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

**మొదటిపేజీ తరువాయి**

'సీఎం ప్రజావాణి' కార్యక్రమం అద్భుతంగా కొనసాగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలను, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రస్తుతం కలెక్టర్ల అధ్వర్యంలో జిల్లాలో ప్రతివారం ప్రజావాణి నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంపై సీఎం సమీక్షించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రజావాణి కార్యక్రమాన్ని వెంటనే రెవెన్యూ డివిజన్‌స్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. ఆ తర్వాత మండల స్థాయిలో నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలన్నారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలను ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని సూచించారు. సంబంధిత విభాగాలకు పంపించి, వాటి పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువు**

ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలన్నారు. ఆలస్యం జరగకూడదని సూచించారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని ఆయన సూచించారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సీఎం అన్నారు. ప్రతి స్థాయిలో ప్రజావాణి కోసం ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

**అవసరమైతే అప్పీల్ వ్యవస్థ**

ఒకస్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే, పై స్థాయి అధికారికి అర్జీ అందేలా, ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని సీఎం సూచించారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. ఫి?ర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతిని తెలుసుకునేలా వీలుండాలన్నారు. ఎక్కడైనా ఆలస్యం జరిగితే, సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు. ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతోందన్నారు. కింది స్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

# ఇంధన కొరతపై టాస్క్ ఫోర్స్

**మొదటిపేజీ తరువాయి**

కొన్నిచోట్ల లారీకి రూ.5 వేలు, ట్రాక్టర్‌కు రూ.1,500, స్కూటర్‌కు రూ.200 చొప్పున ఇంధనం నింపుతామని బంకులు బోర్డులు పెట్టాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా ఆయిల్ కంపెనీల నుంచి బంకులకు సరఫరా రాకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ కమిషనరు కె కన్నబాబు వెల్లడించారు. ప్రతిరోజూ 6,300 కిలో లీటర్ల పెట్రోల్, 9,048 కిలో లీటర్ల డీజిల్ అమ్మకాలు సాగుతున్నాయని తెలిపారు. అయితే శనివారం పెట్రోల్ 8,489 కిలో లీటర్లు, డీజిల్ 10,556 కిలో లీటర్ల అమ్మకాలు సాగాయని ఆ శాఖ కమిషనర్ వివరించారు. స్టాక్ అందుబాటులోనే ఉందని, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల నుంచి సరఫరా తగ్గడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. సరఫరా పెంచాలని ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, సోమవారం సాయంత్రం నాటికి సాధారణ పరిస్థితికి చేరుకుంటుందని చెప్పారు. సరఫరా తగ్గడంతో రాష్ట్ర వ్యాప్తంగా 421 బంకులు మూతపడ్డాయని ప్రభుత్వం చెబుతుంటే పెట్రోల్ బంకు ఓనర్స్ అసోసియేషన్ మాత్రం సుమారు 1,500 వరకు మూతపడ్డాయని చెబుతోంది. ఇంధన కొరత వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా సరుకు రవాణా చేసే వాహనాలు డీజిల్ కోసం వారి దగ్గరలో ఉన్న పెట్రోల్ బంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులు వల్ల నాలుగు రోజుల్లో చేరాల్సిన సరుకు రవాణా లారీలు 6 రోజులకు చేరుతున్నాయని ఎపి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవి ఈశ్వరయ్య తెలిపారు.

**రైతులకు కూపన్ విధానం : సిఎం చంద్రబాబు**

పెట్రోల్, డీజిల్ విక్రయాల్లో డిమాండ్‌కు తగ్గ సరఫరా ఉండేలా, సోమవారంలోగా రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఇంధన కొరతపై ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కంపెనీలు రిటైల్ ఔట్ లెట్ల మధ్య గ్యాప్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఆయిల్ కంపెనీల అసంబద్ధ నిర్ణయాల కారణంగా ప్రజలు ఇబ్బంది పడితే సహించేది లేదన్నారు. గురువారమే సమస్యను గుర్తించామని ముఖ్యమంత్రితో అధికారులు చెప్పగా.. అప్పుడే పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు ఎందుకు తీసుకోలేదని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు రైతులకు కూపన్ విధానం ప్రవేశపెట్టే ఆలోచన కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు చేయాలని సూచించారు. ప్రతి బంకు దగ్గర రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటుతోపాటు సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు.

# గుర్తింపు కోసమే కేసీఆర్‌పై విమర్శలు

**మొదటిపేజీ తరువాయి**

ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేత పిల్లుట్ల రఘు, హుజూర్ నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబి కండువా కప్పి కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు దాటినా కనీసం ప్రస్తావించడం లేదన్నారు. జేమ్స్ బాండ్ల మాదిరి బాండ్ పేపర్లు రాసి అడ్డగోలుగా అబద్ధాలు చెప్పారన్నారు. నల్లగొండ జిల్లాలో ఉన్న ఫ్లోరోసిస్ సమస్యను 60 ఏండ్లల్లో కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోకుండా తరాలకు తరాలనే అంగవైకల్యానికి గురిచేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత కేసీఆర్ ప్రారంభించి మిషన్ భగీరథతో ఫ్లోరోసిస్‌ను నల్లగొండనుంచి తరిమి కొట్టామన్నారు. జిల్లా రైతాంగం నీళ్ల కోసం వందల బోర్లు వేసి అష్టకష్టాలు పడే పరిస్థితి నుంచి పంట పొలాలకు సాగునీరు అందించేలా చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.దేశానికే తలమానికంగా నిలబడే యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని చరిత్రలో నిలిచిపోయేలా రూ.1,800 కోట్లతో అత్యద్భుతమైన పుణ్యక్షేత్రంగా తయారు చేశామని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కరువు కాటకాలతో ఇబ్బంది పడ్డ నల్లగొండ లాంటి జిల్లా అత్యధిక వరి ధాన్యం పండించే స్థాయికి వెళ్లిందంటే బీఆర్‌ఎస్ పరిపాలన ఫలితమేనన్నారు. అప్పు చేసిండు అని చెప్పే కాంగ్రెస్ నేతలు రెండేండ్లలో రేవంత్ రెడ్డి రూ.3.7 లక్షల కోట్ల అప్పు తీసుకువచ్చి ఇప్పటిదాకా ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఎద్దేవా చేశారు. కాంట్రాక్టులకు, కమిషన్లకే ఖర్చు పెట్టారని మండిపడ్డారు. 2023 సాధారణ ఎన్నికలతో పోల్చితే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలం పెరిగిందని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో వచ్చిన స్కైరూట్ కంపెనీకి రిబ్బన్ కట్ చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఒక్కొక్కరు కమల్ హాసన్ ను మించిన నటులున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ పైన మళ్ళీ కుట్రలు ప్రారంభమయ్యాయనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

# పెంచలకోన బ్రహ్మోత్సవాలకు సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి** ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ సందర్భంగా, ఈ నెల 27 నుంచి మే 3వ తేదీ వరకు వైభవంగా జరగనున్న పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పనిసరిగా రావాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. వారి వెంట వచ్చిన ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు చిత్రపటాన్ని బహూకరించారు.

ఆహ్వానాన్ని స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యేను, ఆలయ ఛైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# యూరప్ టూర్‌కు జగన్..

**మొదటిపేజీ తరువాయి**

అర్ధరాత్రి బెంగళూరు విమానాశ్రయం నుంచి ఆయన కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లారు. యూరప్‌లోని పలు దేశాల్లో పర్యటించేందుకు సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం ఆయనకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. కోర్టు ఆదేశాల ప్రకారం మే 15వ తేదీ వరకు ఆయన యూరప్‌లోనే గడపనున్నారు. వాస్తవానికి ఈనెల 20నే ఈ పర్యటన మొదలుకావాల్సి ఉన్నా, కొన్ని కారణాల వల్ల ఐదు రోజులు ఆలస్యమైంది.ఈ పర్యటనలో జగన్ డ్రెస్సింగ్ స్టైల్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. రాజకీయ కార్యక్రమాల్లో సాధారణంగా తెల్లటి చొక్కా, ఫార్మల్ ప్యాంటు, సాధారణ చెప్పులతో కనిపించే జగన్.. ఈసారి అందుకు భిన్నంగా ట్రెండీ లుక్‌లో దర్శనమిచ్చారు. బెంగళూరు ఎయిర్‌పోర్టులో ఆయన బ్లూ డెనిమ్ షర్ట్, బ్లూ జీన్స్ ప్యాంట్, షూస్ ధరించి కనిపించారు. ఎయిర్‌పోర్టులో జగన్‌ను ఈ కొత్త లుక్‌లో చూసిన ప్రయాణికులు, అభిమానులు ఆశ్చర్యపోయారు. ఆయనతో ఫొటోలు, వీడియోలు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి

# తెలంగాణలో ఎండల ఉగ్రరూపం..

## వడదెబ్బకు నలుగురి బలి

తెలంగాణలో సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో జనం అల్లాడిపోతున్నారు. వడదెబ్బ కారణంగా శనివారం ఒక్కరోజే నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. హనుమకొండ జిల్లాకు చెందిన సాదుల నరహరి (58), వరంగల్‌కు చెందిన ఎండీ యాకూబ్ (63), మంచిర్యాల జిల్లా వాసి కొట్రంగి జయరాం (40), సూర్యాపేట జిల్లాకు చెందిన మామిడి నరసింహ (51) వడదెబ్బతో మరణించారు. వీరంతా పనులకు వెళ్లి అస్వస్థతకు గురైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు.మరోవైపు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 44.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కుమరంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లోని పలుచోట్ల 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కామారెడ్డి, ఆదిలాబాద్, భూపాలపల్లి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోనూ ఎండల తీవ్రత కొనసాగుతోంది.నాగర్‌కర్నూల్ జిల్లాలో పిడుగుపాటుకు ఓ యువకుడు మృతి చెందాడు. బల్మూరు మండలం మైలారం గ్రామానికి చెందిన గట్టు సలేశ్వరం (19) పొలంలో గేదెలను కాస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలు కావడంతో రక్షణ కోసం తాటిచెట్టు కిందకు వెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మరణించాడు.

## శాంతి చర్చలంటూ అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకలు

**టెహ్రాన్ : ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**అమెరికా, ఇజ్రాయిల్ డబుల్‌గేమ్ ఆడుతున్నా యనే చర్చ నడుస్తోంది. ఓ వైపు శాంతి చర్చలంటూ దౌత్యం నడుపుతూ.. మరోవైపు అరేబియా సముద్రంలో అమెరికా యుద్ధ నౌకల్ని మోహరింపజేస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించినాడఇజ్రాయిల్ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుకుపడుతూనే ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో శాంతిచర్చలపై అనిశ్చితి నెలకొన్నదని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక కామెంట్స్ చేశారు. అమెరికా విధిస్తున్న ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనం, బెదిరింపుల నడుమ ఆ దేశంతో చర్చలు అసాధ్యమని తేల్చి చెప్పారు. శనివారం పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పెజెష్కియాన్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన శాంతిచర్చలపై ఇరాన్ వైఖరిని స్పష్టం చేశారు. ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని వదులుకోదని, అలాగే ఒత్తిళ్లకు తలొగ్గి ఒప్పందాలు చేసుకోబోదని పెజెష్కియాన్ స్పష్టం చేశారు.

# గూగుల్ రాకతో విశాఖకు విశ్వఖ్యాతి...

**మొదటిపేజీ తరువాయి**

ఈ నెల 28వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా విశాఖ జిల్లా తర్లువాడ వద్ద ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు శంకుస్థాపన జరగనుంది. ఇది కేవలం ఒక డేటా సెంటర్ కాదు, ఆసియా ఖండానికే కీలకమైన ఏఐ గేట్‌వేగా విశాఖను మార్చబోయే ఒక చారిత్రాత్మక ఘట్టం. ఈ హైపర్ స్కేల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుతో అంతర్జాతీయ టెక్నాలజీ పటంలో విశాఖ నగరానికి శాశ్వత స్థానం లభించనుంది. ఫలితంగా, పోర్టు నగరంగా ప్రసిద్ధి చెందిన విశాఖ, ఇకపై "డేటా సిటీ"గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందనుంది.

**దేశ చరిత్రలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ**

గూగుల్ ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 15 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 1.25 లక్షల కోట్లు) భారీ పెట్టుబడి పెట్టనుంది. దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులలో (ఎఫ్‌డీఐ) ఒకటిగా నిలవనుంది. 1 గిగావాట్ సామర్థ్యంతో నిర్మించనున్న ఈ డేటా సెంటర్, రాష్ట్రంలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధికి ఊతమివ్వనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తుండటంతో, ఇలాంటి భారీ ప్రాజెక్టులు వేగంగా కార్యరూపం దాల్చుతున్నాయి. త్వరలో అందుబాటులోకి రానున్న సబ్-సీ కేబుల్ వ్యవస్థ ద్వారా విశాఖ నుంచి నేరుగా వివిధ దేశాలకు డేటా కనెక్టివిటీ ఏర్పడుతుంది. ఇది డేటా సెంటర్ల ఏర్పాటుకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది.

**వేలాది ఉద్యోగాలు, సమగ్ర ఏఐ ఎకోసిస్టమ్**

ఈ భారీ ప్రాజెక్టును తర్లువాడ, అడవివరం, రాంబిల్లి ప్రాంతాల్లో సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో అదానీ కనెక్స్, ఎయిర్‌టెల్ నెక్స్ట్రా వంటి సంస్థలు కూడా భాగస్వాములుగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 6.5 గిగావాట్ల సామర్థ్యంతో మల్టీ-గిగావాట్ డిజిటల్ హబ్‌ను నిర్మించాలన్న ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. గూగుల్ డేటా సెంటర్ కేవలం మౌలిక సదుపాయాల కల్పనకే పరిమితం కాదు. ఇది రాష్ట్ర యువతకు వేలాదిగా నాణ్యమైన ఉద్యోగ అవకాశాలను సృష్టించనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ ఆపరేషన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైంటిస్ట్, క్లౌడ్ ఆర్కిటెక్చర్ వంటి అధునాతన రంగాల్లో నిపుణులకు భారీగా డిమాండ్ ఏర్పడనుంది. దీంతోపాటు, పవర్ సిస్టమ్స్, కూలింగ్ టెక్నాలజీ, సర్వర్ తయారీ, నెట్‌వర్కింగ్ వంటి అనుబంధ పరిశ్రమలు కూడా ఇక్కడ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఇది రాష్ట్రంలో ఒక సమగ్రమైన ఏఐ ఎకోసిస్టమ్ అభివృద్ధికి దారితీస్తుంది.

**అంతర్జాతీయ హంగులతో అభివృద్ధి**

గూగుల్ ఏఐ క్లౌడ్ సేవలతో విశాఖ ఆసియాలోనే ఒక ప్రధాన కేంద్రంగా మారనుంది. దీంతో ఐటీ స్టార్టప్‌లు, రీసెర్చ్ సెంటర్లు, సెమీకండక్టర్ కంపెనీలు విశాఖకు క్యూ కట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ డేటా సెంటర్లకు అవసరమైన గ్రీన్ ఎనర్జీని సరఫరా చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు కూడా త్వరలో అందుబాటులోకి రానుండటంతో విశాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. 'వికసిత్ భారత్ 2047' దార్శనికతకు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ టెక్నాలజీ కేంద్రంగా మార్చే ప్రయాణంలో గూగుల్ రాక ఒక పెద్ద ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# బీసీ గళంతో దద్దరిల్లిన అనంత

## బీసీలే వైసీపీకి వెన్నెముక

-బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన బీసీ గళం

కార్యక్రమానికి భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు

ముఖ్యఅథితులుగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి , మాజీ ఎమ్మెల్యే అనంత






**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 26,( రిపబ్లిక్ న్యూస్ ):** బీసీల పట్ల కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని నిరసిస్తూ వైయస్సార్ సీపీ బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం "బీసీ గళం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ సీపీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, వైయస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ యాదవ్, ఎమ్మెల్సీలు భరత్, మంగమ్మ, శివరామిరెడ్డి, నియోజకవర్గాల సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, తలారి రంగయ్య, లక్కప్ప, కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ మంత్రి శంకర్ నారాయణ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైయస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, బీసీ విభాగం ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మేధావులు, బీసీ అనుబంధం విభాగాల నాయకులు తదితరులు పెద్దఎత్తున హాజరయ్యారు.

### జగన్మోహన్ రెడ్డి గారితోనే బీసీల అభ్యున్నతి సాధ్యం

పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి బీసీ లకు వెన్నంటే ఉంటూ అధికారంలో వారిని భాగస్వామ్యులను చేశారు. మరి గత ఎన్నికల సమయంలో చంద్రబాబు బీసీ లను అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను మరచి స్వలాభాలు చూసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా బీసీ లను ఎం న్యాయం చేసారని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీసీ లకు సరైన గౌరవం, సముచిన స్థానం కల్పించే శక్తి జగన్మోహన్ రెడ్డి గారికి ఉంది తప్ప ఇంకెవ్వరికీ లేదన్నారు. రానున్న రోజుల్లో బీసీలు అందరూ ఏకతాటిపైకి వచ్చి జగన్మోహన్ రెడ్డి ను ముఖ్యమంత్రి ను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు. ఎందుకంటే జగన్మోహన్ రెడ్డి గారితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమన్నారు.

### గడచిన రెండు సంవత్సరాల్లో బీసీలకు చేసింది ఏంటి

అనంతపురం జిల్లా వైయస్సార్ సీపీ అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బీసీ లు అంటే బ్యాక్ వర్డ్ కాదు బ్యాక్ బోన్ అని చాటి చెప్పిన ఏకైన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని చెప్పారు. 2019 ఎన్నికల సమయంలో బీసీ గర్జన లో జగన్మోహన్ రెడ్డి ఏదైతే హామీలు ఇచ్చారో అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటినీ తూచాతప్పకుండా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. బీసీ ల సంక్షేమం కోసం లక్షా ఎనభై వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి కే దక్కుతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 24 మంది మంత్రులకు గాను 11 మంది బీసీ లను మంత్రులను చేసారని గుర్తు చేశారు. మరి ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం గడచిన రెండు సంవత్సరాల్లో బీసీలకు చేసింది ఏంటి అని ప్రశ్నించారు. కేవలం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కాలయాపన చేస్తున్నారు. ఎంతసేపు జగన్మోహన్ రెడ్డి పై విమర్శలు చేయడం, చంద్రబాబు ని పొగడడం తప్పితే బడుగు బలహీన వర్గాల ప్రజలను గురించి ఎవ్వరు ఆలోచించే పరిస్థితి లేదని విమర్శించారు. అందరూ ఐక్యతతో కూటమి ప్రభుత్వం పై పోరాడుతూ జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి ను చేసుకోవాలని పిలుపునిచ్చారు.

### రెడ్ బుక్ పేరుతో బీసీ లపై అక్రమ కేసులు

వైయస్సార్ సిపి బీసీ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో బీసీ లకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత రెడ్ బుక్ పేరుతో బీసీ లపై అక్రమ కేసులు పెడుతూ బీసీలను అణచివేతకు గురి చేయతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి బీసీ లను బ్యాక్ బోన్ గా చూస్తూ రాజ్యాధికారంలో భాగస్వామ్యులను చేస్తే.. చంద్రబాబు బీసీ ల హక్కుల కాలరాస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో బీసీ లు అందరూ ఏకమై జగన్మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి ను చేసుకుంటేనే బీసీ లకు సరైన న్యాయం జరుగుతుందన్నారు.

### బీసీ ఆడబిడ్డలకు 50 ఏళ్లకే పింఛన్ హామీ ఏమైంది

వైయస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ఉన్న నన్ను గుర్తించి జగన్మోహన్ రెడ్డి ఎమ్మెల్సీ ను చేశారని కొనియాడారు. బీసీలు అంటే జగన్, జగన్ అంటే బీసీలు అని నినదించారు. చంద్రబాబు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి





రెండేళ్లు గడుస్తున్నా బిసిలకు ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయలేదని విమర్శించారు. బీసీ ఆడబిడ్డలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానన్న హామీ ఏమైందంటూ ప్రశ్నించారు. 2024 ఎన్నికల సమయంలో బీసీ లకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని చంద్రబాబు తుంగలో తొక్కారని విమర్శించారు. బీసీ లకు న్యాయం చేసే ఏకైక నాయకుడు జగన్మోహన్ రెడ్డి మాత్రమేనని రానున్న 2029 ఎన్నికల్లో జగన్ మరీ ముఖ్యమంత్రి ను చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

### అందరూ కలిసిగట్టుగా కూటమి ప్రభుత్వం పై పోరాడాలి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని. రానున్న రోజుల్లో అందరూ కలిసిగట్టుగా కూటమి ప్రభుత్వం పై పోరాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

### బీసీలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం

మాజీ మంత్రి శంకరనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బీసీల పార్టీ అని చేప్పుకుంటూనే బీసీలకే సముచిత న్యాయం చేయలేదన్నారు. ఎన్నికల ముందు టీడీపీ కూటమి పార్టీ బీసీల రక్షణ చట్టం తీసుకొస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఇప్పటికీ నెరవేర్చలేదని, బీసీలకు కూటమి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసందన్నారు..

### ఎన్ని కేసులు పెట్టిన జగన్ సైనికులు బయపడేది లేదు

మాజీ ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ బీసీలు అంటే బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాదని బీసీలు అంటే బ్యాక్ బోన్ అని చెప్పిన వ్యక్తి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలియజేశారు. జగన్ ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి ఒక్క రూపాయి పేదవాడికే అందిందన్నారు. నా బీసీలు.. ఎస్సీ ఎస్టీలు, మైనార్టీలు అని చెప్పి అండగా నిలిచిన జగన్‌కే అన్యాయం జరిగిందన్నారు. ప్రజలకు జరిగిన అన్యాయాన్ని ప్రతిపక్షంలో ఉండి ప్రశ్నిస్తే.. కేసులు, దాడులు, ఇబ్బందులు పెట్టడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్నారు. ఎన్ని కేసులు పెట్టిన జగన్ సైనికులు బయపడేది లేదన్నారు..

### కాలవ శ్రీనివాసులు లాంటి వ్యక్తులకే తీవ్ర అన్యాయం

మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో బీసీలకే తీవ్ర అన్యాయం జరుగుతుందని, టీడీపీ పార్టీ బీసీల పార్టీ అంటూనే బీకే పార్ధసారధి, కాలవ శ్రీనివాసులు లాంటి వ్యక్తులకే తీవ్ర అన్యాయం చేసిందన్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచిన గత ఐదేళ్లలో బీసీలకే అధిక సీట్లు కేటాయించి బీసీలకు అండగా నిలిచారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కూడా ఎంపీపీ, జడ్పీటీసీ లాంటి పదవులు బీసీలకే ఎక్కువ కేటాయించి బీసీలకు పెద్దపీట చేశామన్నారు.

### చట్టసభల్లో బీసీల రక్షణ బిల్లు పెట్టిన ఘనత జగన్ దే

మాజీ ఎంపీ గోరంట్ల మాదవ్ మాట్లాడుతూ ప్రతి చోట బీసీలు గళాన్ని పెంచి జగన్‌కు అండగా నిలవాలన్నారు. చట్టసభల్లో బీసీల రక్షణ బిల్లు పెట్టిన ఘనత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడేనన్నారు. 8 రాజ్యసభలో సీట్లలో బీసీలకే 4 సీట్లు కేటాయించి బీసీలకు అండగా నిలిచింది జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. రాష్ట్రంలో సర్పంచ్‌లు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలు లాంటి పదవుల్లో బీసీలకే అధికంగా కేటాయించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై కూటమి ప్రభుత్వానికి ఎలాంటి ప్రేమ లేదన్నారు.

### జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో బీసీలకు పేద్దపీట

మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు చేసిన మోసాలకు వ్యతిరేఖంగా నేడు అనంతలో 'బీసీ గళం' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఎర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు అత్యున్నత ప్రాధాన్యతనిచ్చి బీసీలకు పేద్దపీట వేశారన్నారు. 2029 ఎన్నికల్లో బీసీలందరూ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు.







ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888



# వైసీపీ కార్యకర్త మృతి

## కుటుంబానికి అండగా వైసిపి నాయకులు



**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 26,బ్రహ్మసముద్రం / అనంతపురం**

బ్రహ్మసముద్రం మండలం పాల వెంకటాపురం గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త గొల్ల శివలింగ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, పార్టీ ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సూచనల మేరకు, అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5 వేలు నగదు సహాయం అందజేశారు.కార్యకర్తల పట్ల పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చంద్రశేఖర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై పోలీసుల అవగాహన



**రిపబ్లిక్ క్రైమ్, ఏప్రిల్ 26,ఉదిరిపికొండ / అనంతపురం**

మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ఉదిరిపికొండ గ్రామంలో మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అనంతపురం మహిళా డీఎస్పీ ఎస్. మహబూబ్ బాషా, కూడేరు సీఐ జి. రాజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు భారీగా పాల్గొన్నారు. పోలీస్ అధికారులు అందించిన మార్గనిర్దేశాన్ని ఆసక్తిగా స్వీకరించారు.

**మహిళల భద్రతకు పోలీస్ శాఖ అండగా ఉంటుంది**

ఈ సందర్భంగా గృహహింస, మహిళలపై వేధింపులు, సైబర్ మోసాలు, బాల్య వివాహాలు వంటి నేరాలపై సమగ్ర అవగాహన కల్పించారు. స్త్రీరక్ష పోర్టల్, శక్తి టీమ్ సేవలు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై వివరించారు.

సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపొందించడం ద్వారా మహిళల్లో ధైర్యం, స్వీయరక్షణ భావన పెంపొందించడం లక్ష్యమని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందిస్తే తక్షణమే సహాయం అందిస్తామని, మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# విపత్తు నిర్వహణ వ్యవస్థలు బలోపేతం

## సంక్షోభంపై మంత్రుల సమీక్ష సమావేశం



**అమరావతి/సింగపూర్, ఏప్రిల్ 26,(రిపబ్లిక్ న్యూస్)**

అధికారిక పర్యటనలో భాగంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మంత్రుల బృందంతో కలిసి సింగపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక “టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్”లో పాల్గొన్నారు. డాక్టర్ ప్రేమ్ కుమార్ నేతృత్వంలో రెండు విడతలుగా సాగిన ఈ వ్యూహాత్మక సెషన్‌లో పరిపాలనలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను కృత్రిమంగా సృష్టించి, వాటిని సమర్థంగా ఎదుర్కొనే మార్గాలపై లోతైన చర్చ జరిగింది.సంక్షోభ సమయాల్లో ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన నిర్ణయాల ప్రాముఖ్యతను ఈ విన్యాసం ద్వారా మంత్రులు సమీక్షించారు. వనరుల సమర్థ వినియోగం, సమాచార మార్పిడిలో లోపాలు లేకుండా చూడటం, తక్కువ సమయంలో గరిష్ట ఫలితాలు సాధించే విధానాలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఇలాంటి ఆధునిక పద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తే పరిపాలనా వ్యవస్థ మరింత దృఢంగా మారుతుందని, విపత్తుల సమయంలో నష్టాన్ని కనిష్ట స్థాయికి తగ్గించవచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధ పాలనే సింగపూర్ విజయానికి మూలమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఉపాధ్యాయ వృత్తికే తలమానికం నాగరాజు రెడ్డి



**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 26 రిపబ్లిక్ న్యూస్**

ఉపాధ్యాయ వృత్తికి తలమానికం నాగరాజు రెడ్డి అని పలువురు కొనియాడారు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగరాజు రెడ్డి ఆదివారం పదవీ విరమణ చెందారు దీంతో ఆయనకు ఘన వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తికి పదవీ విరమణ లేదని నిరంతర విద్యార్థి అని అన్నారు అనేక సంస్కరణలు తెచ్చారన్నారు ఇటు ఉపాధ్యాయులు అటు విద్యార్థులతో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సంయమనం పాటించి అందరి శ్రేయస్సును కోరిన వ్యక్తిగా నాగరాజు రెడ్డి నిలిచిపోతాడు అన్నారు ఆయన విశ్రాంత జీవితం సజావుగా జరగాలని ఆరోగ్యవంతమైన జీవితాన్ని అనుభవించాలని పలువురు కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

# జీవిత పోరాటాల ప్రతిబింబం .. కొత్త సందేశం

## “ అలజడి మా జీవితం“ పుస్తకావిష్కరణ


### ఆవిష్కరించిన తూముచర్ల రాజారాంద -నిబద్ధతకు గీటురాయి ఉమ్మడిశెట్టి అవార్డు




**అనంతపురం సాహిత్యం, ఏప్రిల్ 26, (రిపబ్లిక్ న్యూస్):**

38 ఏళ్ళు సుదీర్ఘకాలం నిజాయితీ, నిబద్ధతలు, సాహితీ విలువలు, పునాదులుగా ఏదైనా ఒక సాహితీ సేవాసంస్థ ఉందంటే అది ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు అని ప్రముఖ కవి, విమర్శకులు తూముచర్ల రాజారాం అన్నారు. ఆయన ఈ సందర్భంగా రాధేయ ఇటీవల వెలువరించిన కొత్త విమర్శ వ్యాసాల సంపుటి “ అలజడి మా జీవితం“ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఇవాళ జరిగిన ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్ట్ అవార్డు పురస్కార సభలో ఉమ్మడిశెట్టి సత్యాదేవి పురస్కారాన్ని శ్రీకాకుళంకి చెందిన కంచరాన భుజంగరావు గారికి, ఉమ్మడిశెట్టి సతీష్ జాతీయ యువ పురస్కారాన్ని సిద్ధిపేటకు చెందిన జాబేర్ పాషా, అలాగే ఒంగోలుకు చెందిన పరిమి చరణ్ గారికి ఉమ్మడిశెట్టి ఆత్మీయ పురస్కారన్ని ప్రముఖ కవయిత్రి సుమన ప్రణవ్ అందుకున్నారు. గత 38 సంవత్సరాలుగా ఇలా పురస్కారాలు ఇస్తూ తెలుగు సాహిత్యంలో కవులుకు గొప్ప గుర్తింపును అందిస్తున్న ఇలాంటి అవార్డులను అందుకోవడం తమకు ఎంతో సంతోషమని అవార్డు గ్రహీతలు స్పందించారు. ఈ అవార్డులను ఉమ్మడిశెట్టి రాధేయ ప్రదానం చేశారు. వారి శిష్యులు డాక్టర్ సుంకర గోపాల్ డాక్టర్ పెళ్లూరు సునీల్,దోర్నాధుల సిద్ధార్థ , అంకె శ్రీనివాస్ అవార్డు పొందిన కవుల పుస్తకాలను సమీక్షించారు. కార్యక్రమంలో కవులు సిరికి స్వామీనాయుడు, సాంబమూర్తి,టి.అమరనాథ్ రెడ్డి, టి.వి రెడ్డి.రియాజుద్దీన్ జూటూరు షరీఫ్,జెట్టి జయరాం, ఏ ఏ నాగేంద్ర , పుప్పాల శ్రీరామ్,అనిల్ డ్యాని ,మోహిత, చం శాస్త్రి, యమున,మీనాబాయ్ తదితరులు పాల్గొన్నారు.ం

# దేవనకొండ మండలంలో పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ



**దేవనకొండ ఏప్రిల్ 26 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**



దేవనకొండ మండలంలో ఆదివారం (26-04-2026) వివిధ గ్రామాల్లో జరిగిన వివాహ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ళ బొజ్జమ్మ వివాహ వేడుకలకు హాజరై నూతనవధూవరులను ఆశీర్వదించారు.మండలంలో ని పల్లెదొడ్డి, కప్పట్రాళ్ళ, దేవనకొండ గ్రామాల్లో నిర్వహించిన పెళ్లిళ్లకు ఆమె విచ్చేసి, వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.ఈసందర్భంగా గ్రామ ప్రజలు, నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై కూడా ఆమెతో చర్చించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. బొజ్జమ్మ గారి పర్యటనతో గ్రామాల్లోపండుగ వాతావరణం నెలకొంది.

# ప్రజలందరూ జనగణనలో భాగస్వాములు కావాలి

## 5 కే రన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 26,( రిపబ్లిక్ న్యూస్ ):**

జిల్లాలోని ప్రజలందరూ స్వచ్ఛందంగా జనగణనలో భాగస్వాములు కావాలని, అపోహలు వీడి ఈ నెల 30 వరకు కొనసాగనున్న స్వీయ గణనలో తమ వాస్తవిక పూర్తి వివరాలను ప్రజలు నమోదు చేయాలని, 5కే రన్‌ను ప్రారంభించి ఆద్యంతం పాల్గొని స్ఫూర్తినిచ్చిన ప్రిన్సిపాల్ సెన్సస్ అధికారి, జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పిలుపునిచ్చారు.ఆదివారం ఉదయం అనంతపురం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద జనగణన 2027 పై అవగాహన కోసం ఏర్పాటు చేసిన “సెన్సస్ 5కే రన్“ ను జిల్లా రెవెన్యూ అధికారి (డి ఆర్ ఓ) మలోలా, జిల్లా అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.జనగణనపై ప్రజలలో అవగాహన పెంచడానికి చేపట్టిన ఈ కార్యక్రమం ఉదయం 7 గంటలకు అనంతపురం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీ నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, కోర్ట్ రోడ్, సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి, జిల్లా పరిషత్, సప్తగిరి సర్కిల్ రాజు రోడ్ శ్రీ కంఠం సర్కిల్ ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కాలేజీకి చేరుకుంది. ఈ రన్ లో జిల్లా కలెక్టర్ స్వయంగా ఆద్యంతం పాల్గొని విద్యార్థులు, యువతకు ఉత్సాహపరుస్తు స్ఫూర్తిని నింపారు.




**ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయనే అపోహలను వీడాలి**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సెన్సస్ 2027 ప్రక్రియలో భాగంగా ప్రవేశపెట్టిన స్వీయ గణన విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ రన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. స్వీయ గణన అనేది కేవలం వివరాల నమోదు మాత్రమే కాదని, అది దేశం పట్ల మనకు ఉన్న బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 10 లక్షల కుటుంబాలు ఉన్నాయని, కానీ ఇప్పటి వరకు సుమారు 32,000 కుటుంబాలు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకున్నాయని, మిగిలిన వారు కూడా వెంటనే స్పందించి తమ కుటుంబ వివరాలను స్వీయ నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సెన్సస్ అనేది భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు 10 సం.లకు ఒకసారి నిర్వహించే ఒక బృహత్తర ప్రక్రియ అని, ఇందులో ప్రజలు నమోదు చేసే, తెలిపే వివరాలు మన దేశ అభివృద్ధికి, సంక్షేమానికి రచించే ప్రణాళికల కోసమే వినియోగిస్తారని, ఎవరికి ఈ వివరాలు షేర్ చేయరని, గోప్యంగా ఉంటాయని ఎలాంటి అపోహలు లేకుండా తమ పూర్తి వాస్తవిక వివరాలను నమోదు చేయాలని కోరారు. జనగణన వివరాలు ఇస్తే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయనే అపోహలను వీడాలని కలెక్టర్ సూచించారు. సెన్సస్ డేటాను ఏ పథకాలను నిలిపివేయడానికి వాడరని, ఇది చట్టబద్ధమైన ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఒక ప్రాంతంలో జనాభా ప్రాతిపదికన ఆసుపత్రులు, కార్యాలయాలు, రవాణా సౌకర్యాలు, మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రజా అవసరాలను ప్రణాళిక చేయడానికి, అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం ఎంతో అవసరమని వివరించారు. జిల్లాలోని ప్రజలందరూ డిజిటల్ గా వెబ్సైట్ నందు డెస్క్ టాప్ లేదా మొబైల్ నందు జనగణన స్వీయ నమోదులో వివరాలు సులభంగా నమోదు చేయవచ్చుని, సరళమైన వివరాలు మాత్రమే ఉంటాయని తప్పకుండా తమ కుటుంబ వివరాలు నమోదు చేయాలని, మే 1 నుండి 30 వరకు జనగణన ఎన్యూమరేటర్లు ఇంటింటికి గృహ సందర్శనకు వచ్చినప్పుడు, వారికి కేవలం ఈ స్వీయ నమోదు ఐడి చెబితే సరిపోతుందనీ వారు మీ వివరాలను రీ-వెరిఫై చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేస్తారనీ, వెరిఫికేషన్ ప్రక్రియ సమర్థవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు. ఇదివరకే అన్ని స్థాయిల్లో అధికారులు సిబ్బందికి శిక్షణ ఇచ్చి గ్రామస్థాయి వరకు విస్తృత ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను చార్జ్ అధికారులుగా నియమించి సమన్వయంతో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మాస్టర్ ట్రైనర్ లో ఫీల్డ్ ట్రైనర్ల ద్వారా ఎన్యుమరేటర్లకు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఇంకా స్వీయ నమోదుకు ఐదు రోజులే ఉన్నందున విస్తృతంగా మీడియా ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజలందరూ సహకరించి ఈ జనగణ 2027 కార్యక్రమాన్ని విజయంతం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

**ఏప్రిల్ 16 నుండి 30 వరకు ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ సౌకర్యం**

ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సస్ అధికారి మలోల మాట్లాడుతూ ఈ నెల ఏప్రిల్ 16 నుండి 30 వరకు ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందనీ **http//:se.census.gov.in** వెబ్సైట్ లో లాగిన్ అవ్వడం ద్వారా కేవలం ఒక క్లిక్‌తో మీ కుటుంబ వివరాలను సురక్షితంగా డిజిటల్ గా నమోదు చేసుకోవచ్చని, జన గణన 2027 లో పాల్గొని స్వీయ గణన నమోదు చేయడం దేశం పట్ల గౌరవం అని తెలిపారు. ఇంటి యజమాని పేరు, మొబైల్ నంబర్ ఇచ్చి ఓటిపి ద్వారా లాగిన్ అవ్వాలనీ, తెలుగుతో సహా 16 భాషల్లో ఫారమ్ నింపే అవకాశం ఉందనీ, మ్యాప్‌లో మీ ఇంటి లోకేషన్‌ను ఖచ్చితంగా మార్క్ చేయాలనీ, ఇంటి నిర్మాణం, సౌకర్యాలు మరియు కుటుంబ సభ్యుల వివరాలను నింపాలనీ, వివరాల సమర్పణ తర్వాత 11 అంకెల సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడి జనరేట్ అవుతుంది. ఇది మీ మొబైల్‌కు ఎస్ ఎం ఎస్ రూపంలో కూడా వస్తుందనీ స్వీయ నమోదు ప్రక్రియను వివరించి అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో ఏఎస్పి ఇలియాజ్ భాష, అనంతపురం ఆర్డిఓ కేశవ నాయుడు, మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు, డి.ఎస్.పి శ్రీనివాసులు, నీలకంఠారెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. పద్మశ్రీ, ఆర్ఐఓ వెంకట రమణ, సిపిఓ అశోక్ కుమార్, డిఐపిఆర్ఓ బాలకొండయ్య, జిల్లా స్పోర్ట్స్ అధికారి మంజుల, పలువురు జిల్లా అధికారులు, తహసిల్దారులు రాజా, మోహన్ కుమార్, సెన్సెస్ డిప్యూటీ తహసిల్దార్ మాధవరావు, ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు, పలు స్వచ్ఛంద సేవ సంస్థలు, పోలీసు శాఖ అధికారులు ఉద్యోగ సిబ్బంది, మెప్మా, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, క్రీడాకారులు వాకర్స్ బృందం, యువత పుర ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మూడు రోజులువిద్యుత్ సమస్య నుంచి
## నీళ్లు లేవు పట్టించుకోండి సారు...



**శాంతిపురంఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్)**శాంతిపురం మండలం కొలమడుగు పంచాయతీ వడ్డు మడి గ్రామం లో గత మూడు రోజుల నుంచి మోటారు కరెంటు నిలిపివేయడం జరిగింది

30 40 డిగ్రీల ఎండకాస్తున్న ఈ సమయంలో వేడికి చెట్లు ఎండిపోతున్న భూమి భగభగ మండే అగ్నిజ్వాల ఉడుకుతున్న మా బ్రతుకులకు దయ చూడండి సారు అంటూ వడ్డుమడి గ్రామం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ప్రజలందరూ నీరు లేక విలువలాడుతూ కనీసం మోటర్ కరెంటు లేకుండా పట్టించుకోని సంబంధిత అధికారులు..... ఈ విషయంపై సదరు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆ గ్రామానికి మోటార్ కరెంటు వెంటనే ఏర్పాటు చేయవలసిందిగా.. లేనిచో నీళ్ల ట్యాంకర్లు పంపించాల్సింది గా సంబంధిత అధికారులను కోరుకుంటున్నాము..

## కొత్తూరు సుబ్బరాయునికి వెండి నాగభరణం విరాళం.
### ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.





**పాణ్యం ప్రతినిధి. ఏప్రిల్ 26.(ప్రజా రిపబ్లిక్ న్యూస్).**
ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వెండి నాగభరణం విరాళంగా ఆదివారం భక్తులు సమర్పించాలని ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. ఆళ్ళగడ్డ పట్టణమునకు చెందిన విజయ మోహన్ రావు కుమారుడు వెంకట నాగరాజు అనే భక్తుడు, వారికి స్వామివారు ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 395 గ్రాముల వెండి నాగభరణము వితరణ చేశారని, వారికి ఆలయ మర్యాదలతో స్వామివారికి అభిషేకం, అర్చనలు, విశేష పూజలు నిర్వహించి, శేష వస్త్రములతో ఘనంగా సన్మానించి ప్రసాదము వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి మరియు దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## చౌడేపల్లిలో అంగరంగ వైభవంగా
## వాసవి జయంతి మహోత్సవం

**చౌడేపల్లి ప్రతినిధి ఏప్రిల్ 26 రిపబ్లిక్ న్యూస్**
చౌడేపల్లి గ్రామంలో వెలిసియున్న ఆర్యవైశ్య కులోధారిని అయినా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి అంగరంగ వైభవంగా జరిగినది ఉదయం ఐదు గంటలకే ఓంకారం అమ్మవారి సుప్రభాతం ఆర్యవైశ్య మహిళల చే తమ ఇంటి నుండి ఊరేగింపుగా మంగళ వాయిద్యాలతో అమ్మవారికి జయ జయ ధ్వనులతో పాలను తీసుకొని వచ్చి అమ్మవారి మూల విరాట్ కు తమ స్వహస్తాలతో అభిషేకం చేశారు. ఆర్యవైశ్య దంపతులచే నవగ్రహ హోమము దుర్గ హోమము గ్రామంలో అందరూ బాగుండాలని శాంతిహోమము ఆ తరువాత అమ్మవారి తులాభారం ఆర్యవైశ్య మహిళా మండలచే కన్యకులకు పూజ కన్యకులకు బహుమతి ప్రధానం చేశారు తదనంతరం పూర్ణాహుతి మహా మంగళారతి తీర్థ ప్రసాద వినియోగం జరిగినది సాయంత్రం ఆర్యవైశ్య మహిళా మండలిచే శ్రీ వాసవి అమ్మవారి జీవిత



చరిత్ర పారాయణం చేశారు. ఆ తర్వాత కళస ఉద్వాసన ప్రాకారోత్సవం ఊంజల్ సేవ ఆర్యవైశ్యులచే అమ్మవారికి బహుపరాకులు తరువాత మహా మంగళారతి తీర్థ ప్రసాద వినియోగం భోజన వసతి కల్పించారు. పై కార్యక్రమములు అన్ని శ్రీ వాసవి సేవా కమిటీ శ్రీ లలిత ఆర్యవైశ్య మహిళా మండలి మరియు ఆర్యవైశ్య అనుబంధ సంస్థల ద్వారా జరుపబడినది.

## నంది వాహనంపై ఊరేగిన పరమశివుడు

**చౌడేపల్లి ప్రతినిధి**
**ఏప్రిల్ 26 రిపబ్లిక్ న్యూస్**



స్థానిక మృత్యుంజయశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం పార్వతి పరమశివులు నంది వాహనంపై ఊరేగారు ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు కుమారస్వామి మహేష్ ల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయానే ప్రత్యేక అభిషేకము అలంకరణ గావించారు పగలు ఇత్తడి రాత్రి నంది వాహనంపై స్వామివారు భక్తుల నుంచి పూజలు అందుకున్నారు పగటి వాహనానికి రామనాథం ఆయన కుటుంబ సభ్యులు రాత్రి వాహనానికి తుంగ కుటుంబ సభ్యులు వెంకటేష్ బాబు నాగరాజు అమర్నాథ్ భాగ్యములు ఉపయోగాలుగా వ్యవహరించారు వాహన సేవలోనే నంది వాహనం హైలెట్గా నిలిచింది పట్టణంలోనే బలిజ కులస్తుల మహిళలు స్వామివారికి దీపారాధనతో ముగ్గులు చెల్లించారు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

## జాతీయ స్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే ఛాలెంజ్ 2026లో
# శాంతిరామ్ విద్యార్థులు ఘన విజయం



**పాణ్యం, ప్రతినిధి, ఏప్రిల్ 26,(ప్రజా రిపబ్లిక్ న్యూస్ ),**లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ & టెక్నాలజీ విజయనగరం వారి ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో, ఏప్రిల్ 25, 25, 2026 తేదీలలో ఆన్‌లైన్ విధానంలో జరిగిన "ది ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే సెలబ్రేషన్స్ కమ్ ఛాలెంజ్ 2026" పోటీలలో శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల నుండి 25 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొని ప్రశంసనీయమైన ఉనికిని చాటుకున్నారు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో వివిధ సంస్థలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది విద్యార్థుల భాషా ప్రతిభ, సృజనాత్మకత మరియు భావప్రసార నైపుణ్యాలను ప్రదర్శించడానికి ఒక ఉజ్వల వేదికగా నిలిచింది.

ఈ కార్యక్రమంలో మైక్ & మైండ్ ఎక్స్‌ప్రెస్ టు ఇంప్రెస్ ,స్నాప్ స్పీక్ ఫ్రమ్ మీమ్ టు మీనింగ్, బ్రెయిన్‌బజ్: వర్డ్స్ & గ్రామర్ క్విజ్' వంటి అనేక రకాల పోటీలు జరిగాయి. విద్యార్థుల భావప్రకటనా సామర్థ్యాలను, విమర్శనాత్మక ఆలోచనా విధానాన్ని మరియు ఆంగ్ల భాషను సమర్థవంతంగా ఉపయోగించడంలో వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఈ పోటీలను రూపొందించారు. వీరిలో, శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఫైనలిస్ట్ దశకు చేరుకుని, సంస్థకు కీర్తిని తెచ్చిపెట్టారు. ముఖ్యంగా, ఐఐఎంఎల్ మొదటి సంవత్సరం విద్యార్థిని సాదియా షేక్, మైక్ & మైండ్ పోటీలో తన అద్భుతమైన ప్రదర్శన మరియు ఆకట్టుకునే ఉచ్చారణ నైపుణ్యాలకు గాను, ఒక ఆకర్షణీయమైన నగదు బహుమతిని గెలుచుకుని ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది.

దీంతో పాటు, ××× ఈ సిఈ విద్యార్థిని బి. సునంద రెడ్డి తన అసాధారణమైన భావప్రసార మరియు ప్రజెంటేషన్ సామర్థ్యాలను ప్రదర్శించి, టాప్ 3 ఫైనలిస్టులలో స్థానం సంపాదించింది. ఐసిస్ఈ విద్యార్థిని ధరణి కూడా అద్భుతంగా రాణించి, తన సృజనాత్మకత మరియు శీఘ్ర ఆలోచనా విధానాన్ని ప్రదర్శిస్తూ, స్నాప్ స్పీక్ పోటీలో టాప్ 3 ఫైనలిస్టులలో స్థానం సంపాదించింది.

ప్రిన్సిపాల్ డా. ఎం. వి. సుబ్రమణ్యం, విద్యార్థులను వారి అద్భుతమైన విజయాలకు అభినందించి, వారి అంకితభావం మరియు కృషిని ప్రశంసించారు. విద్యార్థులలో భావప్రసార నైపుణ్యాలను పెంపొందించడంలో మరియు వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో ది ఇంగ్లీష్ క్లబ్ గణనీయమైన పాత్ర పోషించిందని ఆయన నొక్కి చెప్పారు.

కోఆర్డినేటర్ లావణ్య పరుచూరి మరియు ఇంగ్లీష్ విభాగాధిపతి ఎ. జి. వెంకటేశ్వర్లు కూడా విద్యార్థుల కృషిని, విజయాలను అభినందించారు. వారు పాల్గొన్నవారి చురుకైన భాగస్వామ్యాన్ని ప్రశంసించి, విద్యా మరియు సహ పాఠ్య కార్యకలాపాలలో రాణించడానికి నిరంతరం కృషి చేయాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమం ఆంగ్ల భాష యొక్క శక్తిని చాటి చెప్పడమే కాకుండా, విద్యార్థులను ఒక విస్తృత వేదికపై ఆత్మవిశ్వాసంతో సంభాషించడానికి, సృష్టించడానికి మరియు పోటీ పడటానికి ప్రేరేపించింది.

## డీజిల్, పెట్రోల్ కొరత ఉందనే వదంతులు నమ్మవద్దు

**డీజిల్ పెట్రోల్ నిల్వలు ఉన్నాయి ఎక్కడ కూడా కొరతలేదు -జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**

**అనంతపురం ప్రతినిధి, ఏప్రిల్ 26,(రిపబ్లిక్ న్యూస్):**
జిల్లాలో అందరు వినియోగదారులు డీజిల్, పెట్రోల్ కొరత ఉందనే వదంతులు ఎవ్వరు కూడా నమ్మవద్దని, అన్ని పెట్రోల్ బంకులలో డీజిల్, పెట్రోల్ నిల్వలు ఉన్నాయని, ఎక్కడ కూడా కొరతలేదని జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ , పెట్రోల్ కొరత ఏర్పడుతుందనే ఆందోళనలో వినియోగదారుల కొనుగోళ్లు భారీగా పెరిగినందువలన అనేక పెట్రోల్ బంకుల వద్ద రద్దీ కనిపిస్తోందన్నారు. జిల్లాలో రోజువారీ అమ్మకాలు పెట్రోల్ 2,57,000 లీటర్లు, డీజిల్ 3,83,000 లీటర్లు కాగా, తేదీ 25.04.2026 న ఒక్కరోజే పెట్రోలు 4,66,000 లీటర్లు డీజిల్ 6,11,000 లీటర్లు వినియోగదారులకు అమ్మకం చేయడం జరిగిందన్నారు. వినియోగదారులు డీజిల్ కొరత ఏర్పడుతుందనే ఉద్దేశంతో ప్యానిక్ కొనుగోళ్లు చేయడం జరుగుతున్నదన్నారు. జిల్లాలో 211 పెట్రోల్ బంకులలో ప్రస్తుతం 14,45,000 లీటర్లు పెట్రోల్, 13,34,000 లీటర్ల డీజిల్ నిల్వలు ఉన్నాయని డీజిల్ కొరత ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లాలోని అన్ని పెట్రోల్ బంకులకు వారి అమ్మకాలకు సరిపడా డీజిల్, పెట్రోల్ సరఫరా చేయవలయునని సంబంధిత ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లకు



ఆదేశములు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలోని అందరు పెట్రోల్ బంకుల యజమానులు వారి అవసరానికి సరిపడా డీజిల్, పెట్రోల్ సంబంధిత ఆయిల్ కంపెనీల నుండి సరఫరా చేయించుకుని ఎటువంటి కొరత లేకుండా వినియోగదారులకు సరఫరా చేయాలని కోరడమైనదన్నారు. వినియోగదారు లెవ్వరూ అవసరానికి మించి పెట్రోల్ మరియు డీజిల్ కొనుగోళ్లు చేయరాదని, కృత్రిమ కొరత సృష్టించకూడదన్నారు. పెట్రోల్ బంకుల యజమానులు వినియోగదారులకు ప్లాస్టిక్ క్యాన్లు యందుగాని, బాటిళ్ళ యందుగాని, ఏ ఇతరమైన డ్రమ్ముల యందుగాని డీజల్, పెట్రోల్ నింపి అమ్మకము చేయరాదన్నారు. కేవలము వినియోగదారుల వాహనముల యందు మాత్రమే పెట్రోల్, డీజిల్ నింపి అమ్మకములు జరపవలెనన్నారు. జిల్లా నందు ఎవరైనా పెట్రోల్ బంకుల యజమానులు స్టాక్ నిల్వచేసినా, బ్లాక్ మార్కెట్ చేసినా కృత్రిమ కొరత సృష్టించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలతో పాటుగా వారి లైసెన్సును రద్దు చేయడం జరుగుతుందని తెలియజేయడమైనన్నారు. పెట్రోల్ బంకులను పర్యవేక్షించుటకు రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు మరియు లీగల్ మెట్రోలజీ అధికారులు టీములుగా ఏర్పడి ఎప్పటికప్పుడు పెట్రోలు బంకుల యందు పెట్రోల్ మరియు డీజిల్ కొరత లేకుండా ఎటువంటి రద్దీ లేకుండా పర్యవేక్షించ వలయునన్నారు. జిల్లా నందుగల అందరు రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు, తహశీల్దార్లు, పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు వారి పరిధిలో గల అన్ని పెట్రోల్ బంకులను తనిఖీ చేయుచూ పెట్రోల్, డీజిల్ కొరత రానివ్వకుండా పర్యవేక్షించాలన్నారు.

## నేడు ఏయూ శతాబ్ది ఉత్సవ సభ
### ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్




**విశాఖపట్నం/న్యూఢిల్లీ, ఏప్రిల్ 26**
: విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల సభను సోమవారం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గౌరవ అతిథిగా మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ హాజరుకానున్నారు. విశిష్ట అతిథులుగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్‌నాయుడు, బి.శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్‌తోపాటు పలువురు ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ సభ జరుగుతుంది. సుమారు 25 వేల మంది విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొననున్నారు. వివిధ రంగాల్లో ఉన్నత స్థాయికి చేరిన ఏయూ పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా సత్కరిస్తారు. కాగా, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ నెల 27, 28 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నట్లు ఆయన కార్యాలయం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఏయూ శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావడంతో పాటు పలు ఇతర అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపింది.

## సీఎం, పవన్‌పై పోస్టుల కేసు..
### రెండో రోజూ విచారణకు హాజరైన భార్గవరెడ్డి




ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డి విచారణ రెండో రోజుకు చేరింది. పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో ఆయన ఆదివారం మరోసారి విచారణకు హాజరయ్యారు.నిన్న సుదీర్ఘ సమయం పాటు విచారించిన పోలీసులు, ఇవాళ కూడా హాజరుకావాలని ఆదేశించడంతో భార్గవరెడ్డి మధ్యాహ్నం పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ ఎదుట విచారణకు వచ్చారు. ఈ కేసులో ఆయనతో పాటు వర్రా రవీందర్ రెడ్డి, అర్జున్ రెడ్డిలపై కూడా ఆరోపణలు ఉన్నాయి. 2022 నుంచి టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని భార్గవరెడ్డి అసభ్యకర పోస్టులు పెట్టించారని, తాడేపల్లిలోని ఐకాన్ బిల్డింగ్‌ను కేంద్రంగా చేసుకుని 130 మంది కన్వీనర్లతో ఈ కార్యకలాపాలు నడిపారని పోలీసులు గుర్తించారు.ఈ రోజు విచారణలో భాగంగా మార్ఫింగ్. అశ్లీల ఫొటోలు, ఫోన్ డేటా, ల్యాప్ టాప్ గురించి సైబర్ క్రైమ్ అధికారుల బృందం భార్గవరెడ్డిని ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో పాటు షర్మిల, సునీత, విజయమ్మ వంటి వారిపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టించారన్న ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. 2024 నవంబర్ 8న నమోదైన ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

# ఉద్ధవ్ 'సేన'లో మళ్లీ చీలిక సంకేతాలు.. బీజేపీ నేతలతో ఎంపీల సమావేశాలు



**ముంబై:** మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మరో చీలిక ఎదుర్కోనున్నట్లు కనిపిస్తున్నది. ఆయన పార్టీకి చెందిన కొందరు ఎంపీలు బీజేపీ నేతలతో సమావేశం కావడం అనుమానాలకు తావిస్తున్నది. మరాఠ్వాడా ప్రాంతంలో ఆ పార్టీకి చెందిన ప్రముఖ నేత, మూడుసార్లు లోక్‌సభ ఎంపీగా ఎన్నికైన సంజయ్ జాదవ్, ముంబైలోని ఉద్ధవ్ ఠాక్రే నివాసమైన మాతోశ్రీలో జరిగిన కీలక సమావేశానికి గైర్హాజరయ్యారు. అలాగే సేనా భవన్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యవర్గ సభ్యుల మరో సమావేశానికి కూడా ఆయన హాజరు కాలేదు. దీంతో సంజయ్ జాదవ్ గైర్హాజరు పార్టీ వర్గాల్లో ఆందోళనలు రేకెత్తించింది. అప్పటి నుంచి ఆయన అందుబాటులో లేరని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, శివసేన (యూబీటీ)కి చెందిన హింగోలి నియోజకవర్గం ఎంపీ నాగేష్ పాటిల్ అష్టికర్, యవత్మల్-వషీం నియోజకవర్గం ఎంపీ సంజయ్ దేశ్‌ముఖ్ కలిసి ఇటీవల కేంద్ర మంత్రి ప్రతాపరావు జాదవ్ ఢిల్లీలో ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఆ తర్వాత కొన్ని రోజులకే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను సంజయ్ జాదవ్ ఢిల్లీలో కలిసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఏదో రాజకీయ మంతనాలు జరుగుతున్నాయన్న ఊహాగానాలకు మరింత బలం చేకూరింది.మరోవైపు శివసేన (యూబీటీ) అగ్రనాయకత్వం, ఆ పార్టీ ఎంపీల మధ్య సమన్వయం లేనట్లు తెలుస్తున్నది. దీని పట్ల కొందరు ఎంపీలు ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పేలవ ప్రదర్శనకు ఇది కారణమని వారు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో కొందరు ఎంపీలు చూస్తున్నట్లు తెలుస్తున్నది.

## కూలీలపై పోలీస్ అధికారి కాల్పులు.. ఒకరు మృతి, మరొకరికి గాయాలు



**న్యూఢిల్లీ:** ఒక పోలీస్ అధికారి కొందరు కూలీలపై కాల్పులు జరిపాడు. ఈ సంఘటనలో ఒక కూలీ మరణించాడు. మరో కూలీ గాయపడ్డాడు. కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తు న్నారు. పారిపోయిన ఆ పోలీస్ అధికారిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. ద్వారకాలోని జాఫర్‌పూర్ కలాన్ ప్రాంతంలో కొన్ని కూలీల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కొందరు కూలీలు పార్టీ చేసుకున్నారు.కాగా, ఆ కూలీలు పెద్దగా శబ్దాలు చేయడంతో సమీపంలో నివసించే పోలీస్ అధికారి అక్కడకు వచ్చాడు. ఈ సందర్భంగా వారితో వాగ్వాదం జరిగింది. ఆగ్రహించిన ఆ పోలీస్ అధికారి తన వద్ద ఉన్న రివాల్వర్‌తో కూలీల గుంపుపై కాల్పులు జరిపాడు. ఇద్దరు కూలీలు గాయపడగా వారిని ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఒక కూలీ మరణించాడు.మరోవైపు కాల్పుల సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీలపై కాల్పులు జరిపిన తర్వాత పారిపోయిన పోలీస్ అధికారి కోసం బృందాలు వెతుకుతున్నాయని పోలీస్ అధికారి తెలిపారు.

## దేవుడి ఊరేగింపు సందర్భంగా కూలిన వంతెన.. తర్వాత ఏం జరిగిందంటే



**బెంగళూరు:** దేవుడి ఊరేగింపు సందర్భంగా చిన్న కాలి వంతెన కూలింది. దీంతో దేవుడి పల్లకీ మోస్తున్న వారితో సహా కొందరు భక్తులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లా మూద్‌బిద్రి సమీపంలో ఈ సంఘటన జరిగింది. పుచ్చెమొగరులోని బావడ బైలు వద్ద ధర్మనేమ ఉత్సవం నిర్వహించారు. ఆ సందర్భంగా తాకోడే బార్కే దేవతల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు.

కాగా, 50 ఏళ్లనాటి పురాతన కాలి వంతెన మీదుగా దేవుడి ఊరేగింపు వెళ్లింది. అయితే మేళతాళాలు దాటిన తర్వాత ఆ వంతెన కూలిపోయింది. దీంతో దేవుడి పల్లకీ మోస్తున్న వారితో సహా వెనుక ఉన్న భక్తులు కింద పడిపోయారు. కాంక్రీట్, రాళ్లు పడటంతో ఎనిమిది మంది గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ వంతెన కూలిన ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# బర్త్ డే పార్టీలో కేక్ పూయడంపై వివాదం.. కాల్పుల్లో ముగ్గురు మృతి

**లక్నో:** బర్త్ డే జరుపుకున్న వ్యక్తి ముఖానికి కేక్ పూయడంపై వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో పుట్టిన రోజు జరుపుకున్న వ్యక్తి గన్‌తో కాల్పులు జరిపాడు. ఈ సంఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఖుర్జా నగర్ ప్రాంతానికి చెందిన జీతు సైని శనివారం రాత్రి ఒక జిమ్‌లో తన పుట్టిన రోజు వేడుక జరుపుకున్నాడు. బర్త్ డే వేడుకలో పాల్గొన్న అమర్‌దీప్ సైని అతడి ముఖానికి కేక్ పూశాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది.కాగా, అమర్‌దీప్ సైని బంధువులైన



మనీష్ సైని, ఆకాష్ సైని ఈ వివాదంలో జోక్యం చేసుకున్నారు. ఈ నేపథ ్యంలో ఆగ్రహించిన జీతు సైని గన్ తెచ్చి వారిపై కాల్పులు జరిపాడు. ఆ తర్వాత తన అనుచరులతో కలిసి అక్కడి నుంచి పారిపోయాడు. కాల్పుల్లో గాయపడిన అమర్‌దీప్, మనీష్, ఆకాష్‌ను ఆసుపత్రికి తరలించారు. అయితే ఆ ముగ్గురు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ బృందం కూడా అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించింది.

# పార్టీ మారిన ఎఫెక్ట్.. 18 లక్షల మంది ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లను కోల్పోయిన రాఘవ్ చద్దా




**న్యూఢిల్లీ:**ఆమ్ ఆద్మీ పార్టీ కీలక నాయకుడు, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా అనూహ్యంగా భారతీయ జనతా పార్టీలో చేరడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత ఆప్తుడిగా, పార్టీలో నంబర్ టూ నాయకుడిగా చలామణి అయిన చద్దా, ఏప్రిల్ 24, 2026న తనతో పాటు మరో ఆరుగురు రాజ్యసభ సభ్యులను తీసుకుని కమలం గూటికి చేరడం రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఆమ్ ఆద్మీ పార్టీలో అవినీతి పెరిగిపోయిందని, అక్కడ కొనసాగడం తన వల్ల కాదంటూ ఆయన పార్టీ మార్పుపై వివరణ ఇచ్చినప్పటికీ, ఈ పరిణామం ఆయన వ్యక్తిగత ఇమేజ్‌పై, ముఖ్యంగా సోషల్ మీడియాలో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపింది.

రాఘవ్ చద్దా బీజేపీ కండువా కప్పుకున్న కేవలం 48 గంటల వ్యవధిలోనే ఆయన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి ఫాలోవర్లు భారీ సంఖ్యలో వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. యువతలో, ముఖ్యంగా జెన్-జీ ఓటర్లలో విశేషమైన క్రేజ్ ఉన్న చద్దా నిర్ణయాన్ని నెటిజన్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పార్టీ మారకముందు ఆయనకు సుమారు 1.46 కోట్ల మంది ఫాలోవర్లు ఉండగా, బీజేపీలో చేరిన మరుసటి రోజే దాదాపు 10 లక్షల ఫాలోవర్లను కోల్పోగా.. 48 గంటల్లో దాదాపు 18 లక్షల మంది ఆయన్ని అన్‌ఫాలో చేసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సోషల్ మీడియా చరిత్రలో ఒక రాజకీయ నాయకుడు ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద ఎత్తున ఫాలోవర్లను కోల్పోవడం అరుదైన విషయమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యువత సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున 'అన్‌ఫాలో' క్యాంపెయిన్ నిర్వహించడం ఆయన పాపులారిటీకి పెద్ద దెబ్బగా పరిణమించింది. ఆమ్ ఆద్మీ పార్టీ సిద్ధాంతాలను నమ్మి ఆయనను ఆరాధించిన అభిమానులు, ఇప్పుడు ఆయన తీసుకున్న రాజకీయ నిర్ణయాన్ని ఒక అవకాశవాద చర్యగా భావిస్తూ తమ నిరసనను డిజిటల్ రూపంలో తెలియజేస్తున్నారు. ఈ పరిణామం రాఘవ్ చద్దా రాజకీయ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న ఉత్కంఠ ఇప్పుడు అందరిలోనూ నెలకొంది.

## రాహుల్, అఖిలేష్ దిష్టిబొమ్మల దహనం.. బీజేపీ మహిళా ఎమ్మెల్యేకు కాలిన గాయాలు



**లక్నో:** మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు వ్యతిరేకించడంపై బీజేపీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అయితే మంటలు అంటుకుని బీజేపీ మహిళా ఎమ్మెల్యేకు కాలిన గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో ఈ సంఘటన జరి గింది. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో 'మహిళా జనాక్రోష్ మార్చ్' నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టి బొమ్మలకు బీజేపీ మహిళా ఎమ్మెల్యే అనుపమ జైస్వాల్ నిప్పు అంటించారు.కాగా, ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. దీంతో బీజేపీ మహిళా ఎమ్మెల్యే అనుపమ జైస్వాల్ ముఖానికి మంటలు అంటుకున్నాయి. ఆమె నుదుటిపై కాలిన గాయాలయ్యాయి. ఆమె తలమీద జుట్టులో కొంతభాగం కాలిపోయింది. మరోవైపు పక్కనే ఉన్న స్పందించారు.

# ఎమ్మెల్యే సురేంద్రబాబుపై సీఎం సీరియస్

### 'టోల్‌గేట్ సిబ్బందిపై దాడి' ఘటనపై అసహనం

### ఎమ్మెల్యే అక్కడే ఉండి కూడా.. అనుచరులను నిలువరించకపోవడం సరికాదని ఆగ్రహం



**అమరావతి, ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):** టోల్‌గేట్ సిబ్బందిపై కల్యాణదుర్గం ఎమ్మెల్యే అలిమినేని సురేంద్రబాబు అనుచరులు దాడి చేయడంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. చిన్న చిన్న విషయాలకు చిరుద్యోగులపై దాడి చేయడం ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. దాడి సమయంలో అక్కడే ఉండి కూడా ఎమ్మెల్యే తన అనుచరులను నిలువరించకపోవడం సరికాదని, ఇలాంటి చర్యలు అటు పార్టీ ప్రతిష్టను, ఇటు ప్రభుత్వ పరువును దెబ్బతీస్తాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెబుతున్నా ఎమ్మెల్యేల తీరులో మార్పు రావడం లేదని, ఇకపై ఇలాంటివి పునరావృతమైతే పార్టీపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. టోల్‌గేట్ సిబ్బందిపై దాడికి దిగిన సురేంద్రబాబు అనుచరులపై కేసు నమోదు చేయాలని సీఎం ఆదేశించారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె-తిరుపతి రహదారిపై గండబోయినపల్లె వద్ద టోల్‌గేట్ సిబ్బందితో శనివారం ఎమ్మెల్యే సురేంద్రబాబు అనుచరులు, ఎస్కార్ట్ సిబ్బంది వాగ్వాదానికి దిగి, దాడి చేసిన విషయం విదితమే. 'ఎమ్మెల్యే వాహనాన్నే ఆపుతారా?' అంటూ వీరంగం చేశారు. ఘటనపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసీసను ఆదేశించారు.

# మీరే పొడిచారు - మీరేం పీకారు

## : మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే!

**మెదక్ ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**

అది బహిరంగ వేదిక. చుట్టు ప్రజలు ఉన్నారు. వీరితో పాటు మీడియా కెమెరాలు కూడా చూస్తున్నాయి. ఆ సమయంలో ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన మంత్రి.. అంతే హుందాగా వ్యవహరించాల్సిన మహిళా ఎమ్మెల్యే గాడి తప్పారు. చిన్న మాట పెద్దదైంది.. పెద్ద మాట పరుష వ్యాఖ్యలకు దారి తీసింది. కలెక్టరు, ఎస్పీ, జిల్లా ప్రజాప్రతినిధుల సమక్షంలోనే మీరు ఏం పొడిచారు..? అని మహిళా ఎమ్మెల్యే నిలదీయగా.. మీరేం పీకారు? అంటూ... సదరు మంత్రి నిలదీశారు. ఇద్దరి మధ్య వివాదం తారస్థాయికి చేరింది. కలెక్టరు, ఎస్పీ జోక్యం చేసుకున్నా.. ఆగలేదు. చివరకు ఆవేశకావేశాలతో ఇరువురు స్టేజీదిగి వెళ్లిపోయారు. దీంతో అసలు కార్యక్రమం అటకెక్కింది. తెలంగాణలోని మెదక్ జిల్లా నర్సాపూర్‌లో మంత్రి వివేక్ వెంకట స్వామి శనివారం సాయంత్రం పర్యటించారు.ఈ సందర్భంగా జిల్లాలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులు పంపిణీ చేసేందుకు లబ్ధిదారులను తీసుకువచ్చారు. ఇదేసమయంలో బహిరంగ సభను కూడా ఏర్పాటు చేశారు. మంత్రి వేదిక ఎక్కిన ఐదు నిమిషాలకు బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కూడా



వేదిక ఎక్కారు. ఈ సమయంలో మంత్రి మాట్లాడేందుకు లేవగా.. ఆమె జోక్యం చేసుకున్నారు. --మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. గుర్తుందా-- అని ఆమె ప్రశ్నించారు. దీంతో మంత్రి స్పందిస్తూ.. --అన్నీ గుర్తున్నాయి. మీరు చేసిన వాగ్దానాలు.. మీరు ఇచ్చిన హామీలుకూడా గుర్తున్నాయి-- అని వ్యాఖ్యానించారు. ఇలా ఒకరినొకరు రెచ్చగొట్టుకున్నారు. ఈ క్రమంలో మంత్రి వివేక్.. మాజీ సీఎం కేసీఆర్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి.. మా నెత్తిన పెట్టిపోయారని.. వ్యాఖ్యానించారు. దీంతో సునీతా లక్ష్మారెడ్డి కూడా మీరు మాత్రం తక్కువ చేస్తున్నారా? అని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారని.. చచ్చిపోయినా పట్టించుకునే తీరిక లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. దీంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి.. వివేక్.. --ఇదంతా మీవల్లే జరిగింది. ఆర్టీసిని కూడా అప్పుల్లో ముంచారు. మీ వల్లే ప్రజలు గోస పడుతున్నారు-- అంటూ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో మీరేం పొడిచారు.. వచ్చి అని సునీత ప్రశ్నించగా.. పదేళ్ల అధికారంలో ఉండి మీరేం పీకారు? అంటూమంత్రి రివర్స్ అయ్యారు.

ఈ వివాదం నేపథ్యంలో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు నినాదాలతో హోరెత్తించారు. ఇక, లబ్ధి దారులు ఏం జరుగుతుందో అనే బెంగతో బిక్కు బిక్కు మంటూ గడిపారు. వేదికపైనే ఉన్న కలెక్టర్ జోక్యం చేసుకుని వారించే ప్రయత్నం చేసినా.. మంత్రి వర్సెస్ ఎమ్మెల్యే ఎవరూ వెనక్కి తగ్గలేదు. దీంతో ఎస్పీ కూడా జోక్యం చేసుకున్నా.. పరిస్థితి చల్లబడలేదు. ఒక దశలో ఎమ్మెల్యేను అరెస్టు చేయొచ్చన్న ప్రచారం కూడా జరిగింది. కానీ, అలాంటిదేమీ లేకుండా..ఇరువురూ వేదిక దిగి చరచరా నడుస్తూ వెళ్లిపోయారు.

# నాగార్జున నమ్మకపోతే వర్మ కెరీర్ ముగిసిపోయేది: జేడీ చక్రవర్తి



టాలీవుడ్ నటుడు జేడీ చక్రవర్తి తాను నటించిన తాజా చిత్రం 'గాయపడ్డ సింహం' ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన సినీ కెరీర్‌ను మలుపు తిప్పిన 'శివ' సినిమా షూటింగ్ మొదటి రోజు జరిగిన ఒక అద్భుతమైన సంఘటనను గుర్తు చేసుకున్నారు.

"షూటింగ్ మొదటి రోజే ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్ ప్లాన్ చేశారు. అప్పటి టాప్ ఫైట్ మాస్టర్ రాజు గారు టైర్లు కాల్చడం, పొగ ఎఫెక్ట్స్ వంటివి డిజైన్ చేశారు. కానీ అప్పుడే ఇండస్ట్రీకి పరిచయమవుతున్న ఆర్జీవీ... అవన్నీ వద్దని, తనకు నేచురల్‌గా కావాలని ముక్కుసూటిగా చెప్పేశారు.ఒక కొత్త దర్శకుడు అంతటి మాస్టర్ ఆలోచనను కాదనడం అప్పట్లో చర్చనీయాంశమైంది. అయితే హీరో నాగార్జున మాత్రం వర్మ ప్రతిభను నమ్మి ఆయనకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు, ఆ నమ్మకమే నేడు ఆర్జీవీని ఈ స్థాయిలో నిలబెట్టింది" అని జేడీ విశ్లేషించారు. లేకపోతే ఆయన కెరీర్ అప్పుడే ముగిసిపోయేదని అన్నారు. రామ్ గోపాల్ వర్మ ముక్కుసూటి మనిషి అని, ఎవరి అభిప్రాయాలకు లొంగకుండా తన విజన్‌తోనే సినిమాను తెరకెక్కించే వారని జేడీ కొనియాడారు.

# 'నా పేరు కరసామి'..

## పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ధనుష్ 'కర' టీజర్ రిలీజ్




విలక్షణ నటుడు ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కర'. విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను శుక్రవారం మేకర్స్ విడుదల చేశారు. టీజర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. ఏప్రిల్ 30న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. తెలుగు రాష్ట్రాల్లో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సిహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.టీజర్‌లో వినిపించిన డైలాగ్స్ సినిమా కథాంశాన్ని, హీరో పాత్ర తీవ్రతను స్పష్టం చేస్తున్నాయి. "పంటో.. గడ్డో, పాపమో.. పుణ్యమో, తను నాటింది.. తనే నరుక్కోవాలి. నేను నాటిన విత్తనం ఇప్పుడు కోత కొచ్చింది. అంత కంటే ముందు నామీద పడ్డ మచ్చని తుడిచేయాలి. నన్ను నమ్ముకున్న వారిని ముందుకు తీసుకెళ్లాలి. నా పేరు కరసామి" అంటూ ధనుష్ చెప్పే సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. తనపై పడిన నిందను తుడిచివేసి, తన వారిని కాపాడుకునే ఓ యువకుడి ప్రయాణమే ఈ సినిమా అని టీజర్ చూస్తే అర్థమవుతోంది. టైటిల్ పాత్ర పోషిస్తున్న ధనుష్, ఇందులో పలు విభిన్న షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు. ఒకవైపు సమస్యలతో సతమతమయ్యే యువకుడిగా, మరోవైపు ఎమోషన్స్‌ను అదుపులో పెట్టుకున్న పరిణతి చెందిన వ్యక్తిగా ఆయన నటనలో వేరియేషన్స్ ఆకట్టుకోనున్నాయి.కుష్మిత గణేష్ సమర్పణలో డాక్టర్ ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ధనుష్ సరసన 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లకు మంచి స్పందన రాగా, తాజాగా విడుదలైన టీజర్‌తో సినిమాపై బజ్ మరింత పెరిగింది.

# నిర్మాతగా కొత్త అవతారం?



విరూపాక్ష వంటి బ్లాక్‌బస్టర్ విజయంతో ఫుల్ జోష్‌లోకి వచ్చిన హీరో సాయి దుర్గ తేజ్, ఆ తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తేజ్ తన కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న సం బరాల ఏటి గట్టు చిత్ర షూటిం గ్‌లో బిజీగా ఉన్నా రు. దాదాపు ఏడాది కాలంగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమా కథ ఎంపిక నుంచి క్యారెక్టరైజేషన్, ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వరకు ప్రతి అంశంలోనూ తేజ్ కష్టపడుతున్నాడని తెలిసింది. హీరో సాయి దుర్గ తేజ్ చేతిలో ఇప్పటికే పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులు ఉన్నాయి. దర్శకుడు సుజీత్‌తో పాటు సందీప్ తో కూడా కొత్త సినిమాలు చేయనున్నట్లు టాక్ వినిపిస్తోంది. వీటితో పాటు మరో రెండు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నాయని వినికిడి. సంబరాల ఏటి గట్టు విడుదలైన వెంటనే ఆ కొత్త ప్రాజెక్టులపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఇక నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా మారేందుకు ఆయన సిద్ధమవుతున్న ట్లు సమాచారం. విజయ్ దుర్గ ప్రొడక్షన్స్ పేరుతో కొత్త బ్యానర్ ప్రారంభించేందుకు తేజ్ రెడీ అవుతున్నారట. త్వరలోనే ఆ నిర్మాణ సంస్థపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముందని తెలిసింది. ఆ బ్యానర్ మొదటి సినిమాలో తేజ్ స్వయంగా హీరోగా నటిస్తారా? లేక కొత్త టాలెంట్ ను ప్రోత్సహించేందుకు నిర్మాణ సంస్థను ప్రారంభిస్తున్నారా? అన్నది తెలియాల్సి ఉంది.

# అక్షయ కుమార్ కుమార్తెకు లైంగిక వేధింపులు.. ఒకరి అరెస్ట్



బాలీవుడ్ స్టార్ నటుడు అక్షయ కుమార్ కుమార్తెకు లైంగిక వేధింపుల కేసులో మహారాష్ట్ర సైబర్ క్రైమ్ పోలీసులు ఒకరిని అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని మహారాష్ట్ర సైబర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు యశస్వీ మీడియాకు వెల్లడించారు. తన కుమార్తె వేధింపులకు గురవుతున్నట్లు అక్షయ్ కుమర్ స్వయంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ధైర్యంగా తనకు ఎదురైన ఇబ్బందిని చెప్పడం వల్లే నిందితుడిని పట్టుకోవడం సాధ్యమందని తెలిపారు.

గతేడాది అక్టోబర్‌లో ముంబై పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అక్షయ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ గురించి అక్షయ్ మాట్లాడుతూ.. తన ఇంట్లో జరిగిన ఓ ఘటన గురించి తెలిపారు. తన కుమార్తె ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుతుండగా.. గుర్తు తెలియని ఓ వ్యక్తి ఆమెకు అసభ్యకరంగా మెసేజ్ చేశాడని అన్నారు. ఆమె న్యూడ్ ఫోటోలను పంపించాలని అతను అడిగాడని పేర్కొన్నారు. ఈ విషయం అక్షయ్ కుమార్తె ఇంట్లో చెప్పడంతో వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించేలా సైబర్ ఎడ్యుకేషన్‌ను వీక్లీ సబ్జెక్ట్‌గా పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు.




# స్టైలిష్ లుక్ లో తమన్నా..

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ వరకు తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తమన్నా భాటియా మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారారు. షూటింగ్స్ తో బిజీగా ఉన్నప్పటికీ, అభిమానులతో టచ్ లో ఉండేందుకు ఆమె ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో ఫోటోలు, అభిప్రాయాలు పంచుకుంటూ వస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు, పోస్ట్ నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల జరిగిన +ు అత్యంత ప్రభావవంతమైన యువ భారతీయులు 2026 అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా, ఆ ఎక్స్పీరియన్స్ ను అభిమానులతో పంచుకున్నారు. ఆ సందర్భంగా ఆమె రాసుకొచ్చిన ఎమోషనల్ కామెంట్స్ అందరి దృష్టి ఆకర్షిస్తున్నాయి. ఆ ఈవెంట్ లో ఉన్న ఎన్విరాన్మెంట్, సహచరుల మధ్య ఉన్న అనుబంధం తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపించిందని పేర్కొంది.'ఆ రాత్రి ఇప్పటికీ నా మనసులో ఉంది. అందరూ ఒకరికి ఒకరు సపోర్ట్ చేస్తూ, నిజమైన ఆనందాన్ని పంచుకున్నారు. విభిన్న రంగాల్లో ఉన్న వ్యక్తుల ప్రయాణాలను చూసి గర్వంగా అనిపించింది' అని ఆమె తన పోస్ట్ లో తెలిపారు. సహచరులు ఒకరిని ఒకరు అభినందించుకోవడం, ఎంకరేజ్ చేసుకోవడం వంటి అంశాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని వెల్లడించారు తమన్నా. అలాగే ఆ రోజు తాను ఎలా రెడీ అయ్యారో అమ్మడు వివరించారు. సాధారణంగా తొందరపడే తనకు, ఈసారి మాత్రం ప్రతి అంశాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా రెడీ అయ్యానని చెప్పింది. డ్రెస్సింగ్ నుంచి స్టైలింగ్ వరకు ప్రతి చిన్న విషయానికీ ఇంపార్టెన్స్ ఇచ్చినట్లు వెల్లడించింది. ఆ ప్రాసెస్ ను ఎంతో ఎంజాయ్ చేశానని తెలిపింది. ఆ ఈవెంట్ లో తమన్నా ధరించిన డ్రెస్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# పెద్ది.. ఆ డేట్ వెనుక ఎన్నో ఆలోచనలు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్లో వస్తున్న 'పెద్ది' చిత్రంపై అంచనాలు భారీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ మొదలైనప్పటి నుండి రిలీజ్ డేట్ విషయంలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మొదట జూన్ 4న సినిమా వస్తుందని ప్రచారం జరిగినా, లేటెస్ట్ గా అందుతున్న సమాచారం ప్రకారం మేకర్స్ మరో డేట్‌ను ఖరారు చేశారు. కేవలం సెంటిమెంట్ కోసం కాకుండా, పక్కా బిజినెస్ లెక్కలతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ డేట్ మార్పు వెనుక ఉన్న అసలు కారణాలు ఇప్పుడు ఫిల్మ్ నగర్ లో ఆసక్తికరంగా మారాయి. అసలు విషయం ఏంటంటే, 'పెద్ది' సినిమాను జూన్ 25న విడుదల చేయడానికి చిత్ర బృందం మొగ్గు చూపుతోంది. జూన్ మొదటి వారంలో స్కూళ్లు రీఓపెన్ అయ్యే హడావిడి ఉండటంతో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు రావడం కష్టమని భావించి జూన్ 4 ఆప్షన్‌ను పక్కన పెట్టారు. అదే 25వ తేదీ అయితే నెలాఖరు కావడంతో పాటు శాలరీలు పడే టైమ్, దీనివల్ల ఓపెనింగ్స్‌కు ప్లస్ అవుతుంది.

అంతేకాకుండా యూఎస్ మార్కెట్‌లో జూలై వీకెండ్ అడ్వాంటేజ్ కూడా ఈ సినిమాకు కలిసి వస్తుంది. ఓవర్సీస్ వసూళ్లపై కన్నేసిన చరణ్ టీమ్, ఈ లాంగ్ రన్ స్ట్రాటజీతోనే జూన్ 25ను లాక్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇప్పటికే 90 శాతం చిత్రీకరణ పూర్తవ్వగా, మే మొదటి వారంలో శ్రుతి హాసన్‌తో ఒక స్పెషల్ ఐటెం సాంగ్ షూట్ చేయబోతున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం మరో విశేషం. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ కథ బి, సి సెంటర్ల ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు. ల్ అందుకే ప్రమోషన్లకు కూడా తగినంత సమయం దొరికేలా జూన్ నెలాఖరును ఎంచుకున్నారు. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నాయి. రామ్ చరణ్‌కు 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత గ్లోబల్ మార్కెట్ పెరిగినప్పటికీ, సోలో హీరోగా తన బాక్సాఫీస్ స్టామినాను నిరూపించుకోవాల్సిన అవసరం ఉంది. బుచ్చిబాబు తన మార్క్ సెన్సిబిలిటీస్‌తో ఈ కథను చాలా ఇంటెన్సివ్ గా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది. రెహమాన్ ఇచ్చే మ్యూజిక్, సినిమాలో ఉండే ఎమోషనల్ సీన్లు ఆడియన్స్‌కు కొత్త అనుభూతిని ఇస్తాయని టాక్. డిస్ట్రిబ్యూటర్లకు కూడా జూన్ 25 సేఫ్ డేట్ అని అనిపించడంతో, అందరూ ఈ డేట్‌కే ఓటు వేశారు. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మొత్తానికి 'పెద్ది' రిలీజ్ విషయంలో మేకర్స్ చాలా తెలివిగా అడుగులు వేస్తున్నారు. కేవలం హడావిడిగా సినిమాను థియేటర్లలోకి తీసుకురాకుండా, వసూళ్లు వచ్చే అవకాశం ఉన్న సమయాన్ని ఎంచుకున్నారు.



## పౌర గ్రంథాలయం ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

**నంద్యాల ఏప్రిల్ 26( రిపబ్లిక్ న్యూస్) :**
వేసవి సెలవులు పురస్కరించుకొని శ్రీ పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయం, నంద్యాల ప్రాంగణంలో 6 వ తరగతి నుండి 10వ తరగతివరకు విద్యార్థి, విద్యార్థులకు ఉచితంగా వివిధ రకాల శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు ఇన్చార్జి గ్రంథాలయ అధికారి డి. మధు తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతు పిల్లలలో దాగి ఉన్న సృజనాత్మక శక్తి వెలుగు తీసేందుకు ఈ ఉచిత శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. వేసవి సెలవులలో పిల్లలు మొబైల్ ఫోన్ తో ఇతర ఆటకాయ పనులతో సమయం వృధా చేయకుండా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు గ్రంథాలయంలో ఈ శిక్షణా తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఉదయం 8 నుండి 10 గంటల వరకు పుస్తక పఠనం, 10 నుండి 11 గంటల వరకు కథలు చెప్పుట మరియు పద్యాలు చెప్పుట, 11 గంటల నుండి 12 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం మరియు ఇండోర్ గేమ్స్ చెస్ క్యారమ్స్ నేర్పించబడును. అదేవిధంగా పిల్లలకు చదివే ముఖ్యం కాదని ఇతర రంగాల్లో వారికి గల టాలెంటును బయటికి తీయడానికి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గ్రంథాలయంలో దాగి ఉన్న విజ్ఞానాన్ని పిల్లలకి అందించవలసిన అవసరం ఎంతగానో ఉందన్నారు. వేసవి లో పిల్లలు సద్వినియోపరిచే విధంగా తల్లిదండ్రులు చూడాలని పిల్లల అభివృద్ధి కోసం శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని పాఠశాలలకు ముందస్తుగా సమాచారం ఇచ్చామని నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చుని ఏప్రిల్ 28వ తారీకు నుండి తరగతులు ప్రారంభమవుతాయని జూన్ 6 తేదీ వరకు జరుగుతాయని తెలియజేశారు. ముగింపు సభలో పిల్లలకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలియజేశారు

## రౌడీ షీటర్లకు, నేరచరిత్ర కలిగిన వారికి కౌన్సిలింగ్

**నేర ప్రవృత్తికి స్వస్తి పలికి సమాజంలో మంచి పౌరులుగా మెలగాలి**

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి**



**నంద్యాల క్రైం, ఏప్రిల్ 26, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వారి పోలీస్ స్టేషన్ల పరిధిలో నివసిస్తున్న రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి, చెడు నడత కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం ప్రస్తుతం వారు జీవిస్తున్న విధానం, జీవనోపాధికి చేస్తున్న వృత్తులపై ఆరా తీశారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్న రాదని మీపై నిరంతరం నిఘా ఉంటుందని, పోలీసుల మాటలను వినకుండా చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ అధికారులు హెచ్చరించారు.

## ఈ నెల 27న ప్రజా సమస్యల పరిష్కార వేదిక


**వేసవి దృష్ట్యా సమయ మార్పు - ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు**

**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా వ్యాప్తంగా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ నెల 27వ తేదీ (సోమవారం)న ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాలు మరియు మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని కార్యక్రమాన్ని ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు తమ అర్జీలను ప్రత్యక్షంగా సమర్పించడమే కాకుండా, వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్‌లో కూడా నమోదు చేసుకునే




సౌకర్యం కల్పించబడిందన్నారు. అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు ముందుగా తమకు సంబంధించిన మండల, డివిజన్ లేదా మున్సిపల్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని, అక్కడ పరిష్కారం కాని సమస్యలనే జిల్లా స్థాయి వేదికకు తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 9:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సొసైటీ మాజీ చైర్మన్ కుమారుని వివాహానికి హాజరైన బుగ్గన అర్జున్ రెడ్డి




**బేతంచెర్ల ప్రతినిధి, ఏప్రిల్ 26,(ప్రజా రిపబ్లిక్ న్యూస్)**బేతంచెర్ల పట్టణానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ రుద్రవరం నారాయణ కుమారుడు ,లోకేష్ & కృష్ణ సాయి,వీరి వివాహం బేతంచెర్ల పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా కళ్యాణ మండపము లో జరిగినది. ఈ వివాహానికి హాజరైన రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి గారి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి. ఈ వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. బుగ్గన అర్జున్ రెడ్డి తోపాటు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, మండల సీనియర్ వైస్ సిపి నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరెక్టర్ మూర్తుజావలి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ సిహెచ్ లక్ష్మిరెడ్డి, మద్దిలేటి స్వామి మాజీ చైర్మన్ బీరువలి నాగేశ్వర రెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు మర్రికుంట మర్రికుంట మురళీధర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, టౌన్ కన్వీనర్ పిట్టల జాకీర్ హుస్సేన్, మాజీ సర్పంచ్ చిట్టే వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగస్వామి, వైసీపీ నాయకులు బుగ్గన బలరాం రెడ్డి, బుగ్గన గోపాల్ రెడ్డి, బుగ్గన మధుసూదన్ రెడ్డి, జయప్రకాశ్ రెడ్డి, రాఘవేంద్ర, కాజా, రవికుమార్, పిక్కిలి మనోహర్ నాయుడు, గొర్లగుట్ట వెంకీ రెడ్డి,రియాజ్, తదితరులు వివాహానికి హాజరై నూతన దంపతులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు

# పేద రోగుల కోసమే ఉచిత వైద్య శిబిరాలు..

**పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ సభ్యుడు పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి**

**విజయవంతంగా 67వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం..**







**నంద్యాల ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్) :**
పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదల కోసమే కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి అన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 67వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి మౌలాలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తన తల్లిదండ్రుల నుండి తనకు వచ్చిన 10 ఎకరాల పొలాన్ని పేదల కోసమే కేటాయించినట్లు చెప్పారు. తన పదకరాల పొలంలో పెద్దిరెడ్డి ట్రస్ట్ తరఫున ప్రజా వైద్యశాలను నిర్మించి అక్కడ పేదలకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి సేవలు అభినందనీయమనీ అన్నారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవడమేనని తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 67వ మెగా వైద్య శిబిరంలో 1000 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్ మౌలాలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి , ముక్కు , గొంతుకు సంబందించిన జబ్బులకు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు

## గోస్పాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని దిబగుంట్ల గ్రామం నందు

# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహణ

**మాదకద్రవ్యాల నియంత్రణకు, ప్రజల భద్రత, రక్షణ ధ్యేయంగా కార్డన్ సెర్చ్ నిర్వహణ**

**అనుమానాస్పద ప్రదేశాల తనిఖీలు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు జరిమానా -గోస్పాడు సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి**





**నంద్యాల క్రైం, ఏప్రిల్ 26, (రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా వ్యాప్తంగా నేరాలను ముందస్తుగా అరికట్టి, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచాలని, ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా, మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్న ఆదివారం గోస్పాడు సబ్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తమ సిబ్బంది సహాయంతో దీబగుంట్ల గ్రామం నందు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు అనుమానాస్పద ప్రదేశాలు తనిఖీలు నిర్వహించడంతో పాటు రౌడీ షీటర్లు, నేర చరిత్ర గల వారి ఇళ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. అంతేకాక మాదకద్రవ్యాలు రవాణా, విక్రయం, వినియోగించిన చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ భద్రత, రోడ్డు ప్రమాదాల, సీసీ కెమెరాలు ఏర్పాటు, బాల్యవివాహాలు, కొత్త చట్టాలు మొదలగు వాటిపై అవగాహన కల్పించడంతోపాటు గ్రామాలలో ఏదైనా సమస్య ఉంటే ముందుగా పోలీసు వారి దృష్టికి తీసుకొని రావాలని చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు.

# సెన్సస్ అవగాహన కోసం ఘనంగా 5కే రన్

**స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలి**

**ఏప్రిల్ 30లోపు స్వీయ గణన పూర్తి చేయాలి**

**"సెన్సస్ ప్రతి పౌరుని బాధ్యత"**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**







**నంద్యాల బ్యూరో, ఏప్రిల్ 26 (రిపబ్లిక్ న్యూస్):**
"సెన్సస్ ప్రతి పౌరుని బాధ్యత" అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేరవేయడమే సెన్సస్ 5కే రన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పేర్కొన్నారు. సెన్సస్ ఔట్‌రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నంద్యాల పట్టణంలో టెక్కే మార్కెట్ యార్డ్ వద్ద 5 కిలోమీటర్ల రన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. టెక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు సాగిన ఈ రన్‌లో జిల్లా అధికారులు, యువత, విద్యార్థులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా పరుగులు తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "సెన్సస్ ప్రతి పౌరుని బాధ్యత" అని స్వీయ గణనకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జనగణన ద్వారా దేశంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అవగాహన ఏర్పడి, సరైన ప్రభుత్వ విధానాల రూపకల్పనకు ఇది బలమైన పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా "జనగణన 2027" కార్యక్రమంలో భాగంగా చేపట్టిన స్వీయ గణన ప్రక్రియపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ కోరారు. ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30 వరకు ప్రజలు తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు ఎస్ సి సెన్సస్ పోర్టల్‌ను వినియోగించి ఇంటి వివరాలు, భౌగోళిక స్థానం (జియో–లొకేషన్) నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎటువంటి పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, కేవలం సరైన సమాచారం అందించడం ద్వారా నమోదు పూర్తవుతుందని వివరించారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన తర్వాత ఒక ప్రత్యేకమైన ఎస్ సి ఐడి జెనరేట్ అవుతుందని, అనంతరం ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడిని చూపితే సరిపోతుందని తెలిపారు. నంద్యాల జిల్లాలో సుమారు 6 లక్షల కుటుంబాలు ఉన్నాయని, అందరూ గడువులోగా స్వీయ గణన పూర్తి చేసి ప్రభుత్వానికి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. దేశ అభివృద్ధిలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలంటే ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించారు. మొత్తం కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com